J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 16

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS



# లాయర్

సంపుటి : 42 సంచిక : 1 10.6.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



# కల సాకారమైంది.. కోరిక నెరవేరింది

## • రాజ్యసభ సభ్యునిగా నియమితులైన బిఎంఆర్ • పల్లి నుంచి ఢిల్లీ దాకా.. మస్తానయ్య ప్రస్థానం

## బీదకు అభినందనల వెల్లువ









రాజ్యసభ సభ్యులుగా నియమితులైన తర్వాత ఇటీవల తొలిసారిగా జిల్లాకు వచ్చిన బీద మస్తాన్‌రావును జిల్లా ప్రముఖులు, వివిధ సంఘాల నాయకులు ఆత్మీయంగా అభినందించారు. మస్తానయ్య తానే స్వయంగా పలువురి ముఖ్యనేతల నివాసాలకు వెళ్లి వారి ఆశీస్సులు అందుకోగా, మరికొంతమంది మస్తానయ్య నివాసానికి వెళ్లి ఆయనను కలిశారు. రాజ్యసభ సభ్యులు 'సేవాభూషణ్' వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తదితర నాయకులు మస్తానయ్యను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి కోసం వారి సూచనలు, సలహాలను మస్తానయ్య స్వీకరించారు.

**కల సాకారమైంది. ఎట్టకేలకు మన మస్తానయ్య కోరిక నెరవేరింది. రాజ్యసభ సభ్యునిగా ప్రజలకు సేవలందించాలనే చిరకాల ఆశయం సిద్ధించింది. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆశీస్సులతో బీద మస్తాన్‌రావు (బిఎంఆర్) ఈనెల 3న రాజ్యసభ సభ్యునిగా నియామక పత్రాలు స్వీకరించడంతో జిల్లా నుంచి మరో రాజ్యసభ సభ్యుడు నెల్లూరు వాణిని వినిపించేందుకు మార్గం సుగమమైంది.**

ఎక్కడి మస్తానయ్య.. ఎక్కడి రాజ్యసభ!.. ఎక్కడ ఇసుకపల్లి.. ఎక్కడ ఢిల్లీ!.. కృషి ఉంటే మనుషులు ఋషులవుతారన్నట్లుగా.. పుట్టింది చిన్న పల్లి (ఇసుకపల్లి)లోనైనా ఢిల్లీ దాకా ఆయన రాజకీయ జీవితప్రస్థానం సాగుతుండడం ఒక అరుదైన విశేషమే! చిన్నతనం నుంచి పల్లెతత్వం.. మంచి మనస్తత్వంతో అంచలంచెలుగా ఎదుగుతూ వచ్చారాయన. నెల్లూరుజిల్లా అల్లూరు మండలంలో సముద్రం ఒడ్డున ఉన్న ఇసుకపల్లి అనే చిన్నగ్రామంలో ఆయన పుట్టారు. తండ్రి బీద రమణయ్య, తల్లి బుజ్జమ్మలు ఆయన్ను గారాబంగా పెంచారు. హైస్కూలు దాకా ఆ పల్లెలోనే చదువుకుని, అల్లూరులో ఇంటర్, ఆ తర్వాత నెల్లూరుకొచ్చి సర్వోదయ కాలేజీలో చేరి బికాం పూర్తిచేశారు. మద్రాసులో సిఏ చదువుతూ కారణాంతరాల వల్ల మధ్యలో నిలిపేసి మద్రాసు సవేరా హోటల్లో ఒక చిన్న ఉద్యోగిగా చేరారు. అప్పుడే ఆక్వా రంగంపై దృష్టి సారించడంతో ఆయన జీవితం మలుపు తిరిగింది. అందులోనూ సముద్రతీర నివాసి కావడంతో అక్కడి మత్స్యకారులు, పల్లెప్రజలతో ఉన్న ఆత్మీయ సంబంధాలతో ఆక్వారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి ఆ రంగంలో చిన్న స్థాయి నుంచి అందరూ గర్వించే విధంగా సమున్నతస్థాయికి ఎదిగారు. వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధులు కల్పిస్తూ వందల కోట్ల టర్నోవర్‌తో ఆక్వా సామ్రాజ్యంలో తిరుగులేని పారిశ్రామికవేత్తగా రాణించారు. అయితే, ఆయనెంత ఉన్నత స్థానంలో ఉన్నా పేరుకు తగ్గట్టుగా తొలినుంచీ బీదలంటే ఎంతో అభిమానం. వెనుకబడిన వర్గాల ప్రజలు, అణగారిన వర్గాల వారంటే ప్రాణం. వారికి తనవంతు సేవలు చేయాలనే తపనలోంచి ఆవిర్భవించినదే బిఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్.

### 'బిఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్' ద్వారా సేవలు

పేదసాదలకు, నిరుపేదలకు బిఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్‌ను వేదిక చేశారాయన. పల్లెప్రజలకు, అన్నార్తులకు, నిరుద్యోగులకు, పేద మహిళల అభ్యున్నతికి తమ ట్రస్ట్ ద్వారా మస్తానయ్య చేసిన..చేస్తున్న సేవలు అపారం. జిల్లాలోని తీరప్రాంత గ్రామాల్లో బిఎంఆర్ అంటే చాలు..'మా మస్తానయ్య' అంటూ ఆత్మీయంగా పిలుచుకుంటారు జనం. పేదరికాన్ని జయించాలని, బాగా చదువుకోవాలని ఆయన అనునిత్యం తమవద్దకు వచ్చే పల్లెవాసులకు, మత్స్యకారులకు చెప్తూనే ఉంటారు. చెప్పడమే కాదు వారి కష్టనష్టాల్లో పాలుపంచుకుంటూ వారి సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతుంటారు. పుట్టిన గడ్డపై మమకారంతో ఇసుకపల్లి ప్రాంతాల్లో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించారు. అందుకే మస్తానయ్యంటే జిల్లా ప్రజలకు, ముఖ్యంగా తీరప్రాంత గ్రామాల వారికి ఎంతో అభిమానం. ఆ ప్రజాభిమానమే ఆయన్ను రాజకీయరంగ ప్రవేశం చేయించింది.




మస్తానయ్యను అభినందిస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

### మంచి మనిషి.. మా మస్తానయ్య!

రాజకీయాల్లో తాను కొత్త అయినప్పటికీ ఆయనకు ప్రజల నుంచి మంచి మద్దతు ఉండేది. అదే ఆయన్ను ముందుకు నడిపించింది. 2001 నుంచి 2006 దాకా బోగోలు మండలం జడ్పీటిసిగా ఆయన గ్రామస్థాయిలో ప్రజల స్థితిగతులు, వారి సమస్యలు తెలుసుకున్నారు. వారి బాధలు తీర్చేందుకు అహర్నిశలు కృషి చేశారు. భగవంతుని ఆశీస్సులతో ఆ తర్వాత ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన కొండ బిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మెన్‌గా కూడా ఆయనకు పదవి లభించింది. ఆ దేవాలయం అభివృద్ధికి ఆయనెంతగానో కృషిచేశారు. మానవసేవే మాధవసేవ అన్నప్పటికీ, అటు మానవసేవ ఇటు మాధవసేవ కూడా చేస్తూ ఒక్కనిమిషం కూడా తీరికలేకుండా ఆయన పని చేసేవారు. జనం మనిషి మస్తానయ్య అనే మంచిపేరు తెచ్చుకుని 2009లో కావలి శాసనసభ్యునిగా కూడా ఎన్నికై ఆ నియోజకవర్గం అభివృద్ధికి బాటలు వేశారంటే ఆయనెంతగా శ్రమించివుంటారో ఊహించుకోవచ్చు. అంతేకాదు, శాసనసభ ఏర్పాటుచేసిన వెనుక బడిన తరగతుల సంక్షేమ కమిటీలో సభ్యునిగా కూడా ఉంటూ రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది వెనుకబడినవర్గాల ప్రజల అభ్యున్నతికి తమవంతు తోడ్పాటునందించారు. దీంతో మస్తానయ్య పేరు రాష్ట్రానికంతా చిరపరిచితమైంది.

### జిల్లాకే గర్వకారణం

దేశంలో అత్యున్నతమైన రాజ్యాంగవ్యవస్థలైన రాజ్యసభ, లోక్‌సభల్లోనూ నెల్లూరీయులు చోటు దక్కించుకోవడం గొప్ప విశేషం. రాజ్యసభ ఛైర్మెన్‌గా మన నెల్లూరీయుడు, భారత ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఎంతో ఉన్నత స్థానంలో ఉండడం జిల్లాకే గర్వకారణం. రాజ్యసభ సభ్యులుగా ఇప్పటికే ఉన్న మన నెల్లూరీయులు.. సేవాభూషణులు..వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, విజయసాయిరెడ్డిలతో పాటు లోక్‌సభలోనూ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి (నెల్లూరు), మాగుంట శ్రీనివాసులురెడ్డి (ఒంగోలు)లు కూడా నెల్లూరీయులు కావడం, రాజకీయాల్లో ఎంతో అనుభవం ఉన్న వీరితో పాటు బీద మస్తానయ్య కూడా పెద్దల సభకు ఎంపిక కావడం నెల్లూరీయుల అదృష్టమనే చెప్పాలి. విజయసాయిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఆర్ కృష్ణయ్య, బీద మస్తాన్‌రావు నాలుగు రాజ్యసభ స్థానాల్లో ఏకగ్రీవం కావడం రాష్ట్రానికే శుభసూచకం. రాజ్యసభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి 9 మంది రాజ్యసభ సభ్యులుంటే అందులో అయిదుగురు బీసీలే కావడం, వెనుకబడిన వర్గాల వారికి ముఖ్యమంత్రి జగన్ ఇస్తున ప్రాధాన్యతకు నిదర్శనం. ఆ ప్రాధాన్యతలో మన మస్తానయ్య ముందుండడం విశేషం. ఏదేమైనా చిన్న స్థాయి నుంచి ఎదిగి పెద్ద స్థాయిలో ఎంతో గౌరవప్రదమైన పెద్దల సభకు వెళ్తున్న మన మస్తానయ్యకు..ఢిల్లీలో సమున్నత స్థానాల్లో ఉన్న మన నెల్లూరీయులందరికీ 'లాయర్' శుభాకాంక్షలు.



### విష్ యు... ఆల్ సక్సెస్

**రాజ్యసభ సభ్యులుగా నియమితులైన బీద మస్తాన్‌రావు (బిఎంఆర్)ను ఇటీవల నెల్లూరులోని ఆయన నివాసంలో కలసి 'విష్ యు ఆల్ సక్సెస్' అంటూ ఆత్మీయాభినందనలు తెలియజేస్తున్న 'లాయర్' పత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి.**

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 42 సంచిక : 1 10.6.2022, శుక్రవారం వెల : రూ. 5 /-

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## నిర్భయంగా... నిరంతరాయంగా!

వారం వారం మన లాయర్ సాగిస్తున్న అక్షర సమరానికి 41 సంవత్సరాలు పూర్తయ్యాయి. జూన్ 5, 2022న 42వ ఏట అడుగుపెట్టింది మన లాయర్. నవంబర్ 12, 2021న రమణీయ, కమనీయ, చిరస్మరణీయ వేడుకగా జరిగిన మన లాయర్ 40వ పుట్టినరోజు వేడుకలో భారత ఉపరాష్ట్రపతివర్యులు మన నెల్లూరు ముద్దుబిడ్డ ముప్పవరపు వెంకయ్యనాయుడు గారు పాల్గొని మన లాయర్‌ని ఆశీర్వదించడం లాయర్ ప్రస్థానంలో మరో మరపురాని మధురమైన ఘట్టం. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నెల్లూరు ప్రముఖులెందరో ఆనాటి కార్యక్రమంలో భాగస్వాములై మీతో మేమున్నాం అంటూ మన లాయర్‌కి కల్పించిన భరోసా, లాయర్‌కి కొండంత అండ.

ప్రపంచం మారుతోంది. సమాజం కొత్త రూపం సంతరించుకుంటోంది. రాజకీయాలు వింత పుంతలు తొక్కుతున్నాయి. గుడ్డిదీపంతో జీవనాన్ని సాగించే కాలం నుండి మిరుమిట్లుగొలిపే ఎల్ఈడి కాంతులలో జీవించే స్థాయికి మానవుడు ఎదిగాడు. పావురాళ్ల ద్వారా సందేశం అందుకునే యుగం నుండి అరచేతిలో అంతర్జాలాన్ని ఆడించే స్థాయికి మనిషి మేధస్సు పెరిగింది. క్షణం క్షణం ఒక కొత్త ఆవిష్కరణతో మానవాళి ముందుకు సాగుతోంది. ఇదే తరుణంలో మానవ నైజం కూడా మారింది. అవినీతి, అధర్మం, దుర్మార్గం, దౌర్జన్యం, రాక్షసత్వం రాజ్యమేలుతున్నాయి. కలియుగం క్రమేణా కలుషిత యుగంగా మారుతోంది. ప్రశ్నించేవారి భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతోంది. నిర్భయంగా నిలదీసేవారు నిందల పాలవుతున్నారు.

ఇలాంటి పరిస్థితులలో ప్రపంచం నలుమూలలా ఉన్న మన లాయర్ ఆప్తులు, ఆత్మీయులు, ఆత్మబంధువులు, అభిమానులు అందిస్తున్న ప్రోత్సాహంతో, రెట్టింపు సమరోత్సాహంతో... నిర్భయంగా, నిష్పాక్షికంగా, నిరంతరాయంగా, నిర్విరామంగా అక్షర సమరాన్ని కొనసాగించడానికి ఈ నలభై ఒకటవ వార్షికోత్సవం సందర్భంగా పునరంకితమవుతోంది మన లాయర్. ఇన్నేళ్ళుగా, ఇన్నాళ్ళుగా... మన లాయర్‌ని దీవించి... ఆదరించి అక్కున చేర్చుకుంటున్న అశేష పాఠకలోకానికి, ప్రకటనకర్తలకు శిరస్సు వంచి నమస్కరిస్తూ... కృతజ్ఞతాభివందనాలు తెలుపుకుంటోంది లాయర్.

తుంగా శివప్రభాత్‌రెడ్డి (ప్రభు)

## నేతల మాటల మంట..
# బీజేపీకి తంటా



- భాజపా ముసుగు తొలగిందా... పార్టీ ఇరుకున పడిందా?
- భగ్గుమన్న ముస్లిం దేశాలు... పెల్లుబికిన ఆగ్రహావేశాలు!
- గల్ఫ్‌లో మార్మోగుతున్న నిరసన గళం... ఇబ్బందిపడుతున్న కమలదళం!

నదిలో నావలా... చల్లగా సాగుతుండిన భాజపాకి ఇప్పుడు లంగరు పడింది. కనీసం జాతీయ స్థాయిలో కూడా గుర్తింపులేని ఇద్దరు పార్టీ నేతలు చేసిన అధికప్రసంగం అంతర్జాతీయ స్థాయిలో రచ్చకు దారి తీసింది. పార్టీ స్పీడుకి సడెన్ బ్రేకులు వేసింది. 10లో



## మీరు మారండి..
# లేదంటే.. మిమ్మల్నే మార్చేస్తా

పార్టీ నేతలకు జగన్ ఝలక్! 3లో




### ఈత సరదా..

# ఇద్దరి స్నేహితుల ప్రాణాలు తీసింది

> పెన్నానదిలో ఇంటర్ విద్యార్థుల దుర్మరణం > కాగులపాడు కన్నీటిమయం







## మృతుల కుటుంబాలకు

## 2 లక్షలు సాయమందించిన ప్రసన్న

జొన్నవాడ వద్ద ఉన్న పెన్నా నదిలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోయిన కాగులపాడు గ్రామానికి చెందిన షేక్ మున్నా, ఆవుల రాకేష్‌ల కుటుంబాలను ఓదార్చి, ఒక్కో కుటుంబానికి లక్ష రూపాయల వంతున ఆర్థికసాయం అందించారు కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి. ఈ నెల 9వ తేదీ గురువారం బాధిత కుటుంబాలను పరామర్శించి, తమ తండ్రి స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్టు నుండి 2 లక్షల రూపాయలను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు వవ్వేరు కో–ఆపరేటివ్ ఛైర్మెన్ సూరా శ్రీనివాసులురెడ్డి, నాయకులు చెర్లో సతీష్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి డాక్టర్ అల్లాభక్షు తదితరులు పాల్గొన్నారు.


**ఆ ఇద్దరు స్నేహితులు పెన్నానదిలో సరదాగా ఈతకు వెళ్లి దుర్మరణం పాలయ్యారు. దీంతో వారి తల్లితండ్రుల కడుపుకోత వర్ణనాతీతం. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడ వద్ద ఉన్న పెన్నానదిలో జరిగిన ఈ దుర్ఘటన కాగులపాడును కన్నీట ముంచింది. మృతుల కుటుంబాలు, బంధువర్గాలకు తీరని ఆవేదన మిగిల్చింది.**

బుచ్చి మండలంలోని కాగులపాడుకు చెందిన ఇంటర్ విద్యార్థులు ఆవుల రాకేష్, షేక్ మున్నాలు ఈనెల 5న పెన్నానదిలో ఈతకు వెళ్ళి గల్లంతయ్యారు. ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులు రంగంలోకి దిగి గజఈతగాళ్ళతో గాలించి వారి మృతదేహాలను ఈనెల 6న వెలికి తీసి, పడవలో ఒడ్డుకు చేర్చారు. తమ బిడ్డల మృత దేహాలను చూసి వారి తల్లితండ్రులు, బంధువులు పెద్దపెట్టున రోదించారు. దాదాపు 24 గంటల పాటు గాలించిన తర్వాత వారి మృతదేహాలు లభించాయి.

### బాధితులను ఓదార్చిన ఎమ్మెల్యే ప్రసన్న:

తొలుత మృతదేహాలను వెలికితీయించడంలో జాప్యం జరుగుతోందంటూ బాధితులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేయడంతో ఆ సమాచారం తెలుసుకున్న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి, వవ్వేరు బ్యాంకు ఛైర్మెన్ సూరా శ్రీనివాసులురెడ్డి, డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతిరావు, డిఎస్పీ హరినాథ్‌రెడ్డి, సిఐ కోటేశ్వరరావు, ఎస్ఐ వీరప్రతాప్ తదితరులంతా హుటాహుటిన అక్కడికి వెళ్ళి పరిస్థితిని శాంతపరిచారు. ఎమ్మెల్యే ప్రసన్న బాధితులను ఓదార్చారు. పెన్నానది వద్ద ఎవరూ ఈతకు దిగి ప్రమాదాలకు గురికాకుండా ముందస్తుగా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఇకపై ఎవరూ నదిలోకి వెళ్ళకుండా కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

**కాలధర్మం**



### కన్నడనాట తెలుగింటి రుచులను వండించి వడ్డించిన....

# నెల్లూరు నలభీముడు.. నాగార్జున కృష్ణారెడ్డి ఇక లేరు

*నాగార్జున కృష్ణారెడ్డిగా ప్రాచుర్యం పొందిన నలగట్ల కృష్ణారెడ్డి తన 87వ ఏట జూన్ 2వతేది గురువారం రాత్రి తుదిశ్వాస విడిచారు. అవసరం మనిషి గమనాన్ని ఎలా మారుస్తుందో, ఏ గమ్యానికి చేరుస్తుందో చెప్పలేం. ఆలా ఊహించని మలుపులతో సొంతూరు నుండి బెంగళూరుకు చేరి, నేడు దక్షిణ భారతదేశమంతా తన పేరు మారుమోగేలా బెంగళూరు నగరంలో తన ప్రస్థానాన్ని సాగించిన 'నెల్లూరు నలభీముడు' నాగార్జున కృష్ణారెడ్డి. ఆయన అసలు పేరు నలగట్ల కృష్ణారెడ్డి, కానీ ఆయన సంస్థ పేరే ఇంటిపేరుగా మారిపోయి నాగార్జున కృష్ణారెడ్డిగా ప్రాచుర్యం పొందారు. గత ఏడాది కృష్ణారెడ్డి సహధర్మచారిణి శ్రీమతి మధుసూదనమ్మ అకస్మాత్తుగా దివంగతురాలయ్యారు. అప్పటినుండి కృష్ణారెడ్డి మానసికంగా బాగా క్రుంగిపోయారు. కొంతకాలం ఆయన కూడా అనారోగ్యంతో బాధపడి జూన్ 2న కన్నుమూశారు.*

1935 నవంబర్ 10న అల్లూరులో సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు నలగట్ల కృష్ణారెడ్డి. చిన్నతనం నుండి అతి చురుకైనవారు. ఆర్.కే హైస్కూల్లో టీచర్లందరికీ ఇష్టమైన విద్యార్థి ఆయన. ఏక సంథాగ్రహి, చెప్పిన విషయాన్ని ఇట్టే పట్టేస్తాడు. ఈ అబ్బాయికి మంచి భవిష్యత్తు ఉందని అందరూ అనుకునేవారు. కానీ వారొకటి తలస్తే విధి మరొకటి తలచింది.

కృష్ణారెడ్డి చిన్నతనంలోనే అంటే ఏడవ తరగతిలో ఉండగానే అకస్మాత్తుగా నాన్న దివంగతులయ్యారు. కుటుంబ బాధ్యత భారం చిన్నతనంలోనే ఆయనపైన పడిపోయాయి. అంతటితో చదువుకు స్వస్తిచెప్పి రైతుగా మారి, వ్యవసాయం చేయడం మొదలు పెట్టారు. తాను పుట్టేసరికే తన అక్క వెంకట సుబ్బమ్మకు పెళ్ళి కూడా జరిగిపోయింది. ఇద్దరికీ వయసులో అంత తేడా ఉంది. అమ్మకు తోడుగా అక్క, బావల నీడలో పెద్దవాడై మధుసూదనమ్మను మనువాడి తానూ ఒక ఇంటివాడయ్యారు. కృష్ణారెడ్డికి ముగ్గురు సంతానం. పెద్దబ్బాయి ఆనంద్, కుమార్తె శిరీష, ఆఖరి అబ్బాయి మోహన్.

పిల్లలు పుట్టినప్పటి నుండీ కృష్ణారెడ్డిది ఒకటే ఆలోచన, తన చదువు ఎలాగూ సాగలేదు, కనీసం తమ బిడ్డలనైనా బాగా చదివించుకోవాలి. అదే తపనతో పిల్లల ప్రాథమిక చదువులు అల్లూరులో అయిపోగానే ఉన్నత విద్య కోసం తన కుటుంబాన్ని నెల్లూరుకు మార్చారు. అందరూ నెల్లూరులో చదువుతుండగానే పెద్దబ్బాయి ఆనంద్ ఇంటర్ పూర్తిచేసి ఇంజనీరింగ్ చదువు కోసం బెంగళూరు చేరాడు. ఇక్కడే కృష్ణారెడ్డి బెంగళూరు ప్రయాణానికి కూడా పునాది పడింది. కొడుకు బాగోగుల కోసం తానూ కుటుంబ సమేతంగా బెంగళూరు వచ్చేశారు.

### బెంగళూరు ప్రస్థానం ...

బెంగళూరుకి వచ్చారనే కానీ ఏం చేయాలన్న స్పష్టత లేదు. ముందుగా సిటీ మార్కెట్లో అప్పటికే నడుస్తుండిన మరో హోటల్ పక్కనే తానూ ఒక చిన్న ఫుడ్ సెంటర్ లాంటిది పెట్టారు. 9 నెలలు నడిపారు. దానికి పేరు కూడా పెట్టలేదు. ఆ తరువాత వచ్చిన ఆలోచనతో 1981 అక్టోబర్ 9వతేదీన ఆనందరావు సర్కిల్‌లో తన కుమారుడు ఆనంద్ చదివే కాలేజీ దగ్గరే నాగార్జున పేరుతో రెస్టారెంట్ ప్రారంభించారు కృష్ణారెడ్డి. ఆయనకు పట్టుదల ఎక్కువ. మొండితనం కూడా జాస్తి. తాను ఏ పని చేసినా తానే నెంబర్ వన్‌గా ఉండాలన్న తపన. ఒక విధంగా చెప్పాలంటే ఆ గుణాలే ఆయనను విజయపథంలో నడిపించాయి. కాలేజీ స్టూడెంట్లు సరిగ్గా డబ్బులిచ్చేవారు కాదు. వేళకు వచ్చి తిని అప్పుపెట్టి వెళ్ళేవారు. పిల్లలు కదా పోనిలే అని సరిపెట్టుకునేవారు కృష్ణారెడ్డి. కొన్ని రోజులకి తన చిన్నకొడుకు మోహన్‌రెడ్డిని కూడా తనకు జతగా చేసుకున్నారు. కృష్ణారెడ్డి అక్కా బావా కూడా ఆయనకు తోడయ్యారు. ఇంత మంది కష్టపడుతున్నా శ్రమే మిగులుతుంది తప్ప లాభం కనపడడం లేదు. ఇక మూసేయడానికి నిర్ణయించుకుని ఆనందరావు సర్కిల్ రెస్టారెంట్ బేరం పెట్టేశారు. ఎంత వచ్చినా వచ్చిందే చాలనుకుని సర్దుకోవాలనుకున్నారు.

### అతిపెద్ద మలుపు...

అదే సమయంలో రెసిడెన్సీ రోడ్డులో అన్నపూర్ణ గెలాక్సీ పేరుతో రెస్టారెంట్ నడుపుతుండిన దూడల నారాయణరావు, కృష్ణారెడ్డికి బంపర్ ఆఫర్ ఇచ్చారు. నీకు ఒక అవకాశం ఇవ్వాలనుకుంటున్నాను ధైర్యం ఉందా...? అంటూ తన హోటల్ ఇచ్చేస్తా తీసుకోమని అన్నారు. కృష్ణారెడ్డి వెనుకా ముందూ ఆలోచించలేదు, తన దగ్గర ఉండేదే ధైర్యం అని చెప్పారు. తెలిసిన వాళ్ళు వారించారు, వద్దన్నారు. ఒక వైపు ఆర్.ఆర్, మరోవైపు అమరావతి... ఇద్దరిమధ్యలో నువ్వు నెగ్గలేవు అంటూ నిరుత్సాహపరచారు. వాళ్ళిద్దరి మధ్య ఉంటేనే నాకు ఛాలెంజ్‌గా ఉంటుంది. నేనేంటో నిరూపించుకోవడానికి వీలుంటుంది అంటూ ముందడుగు వేశారు. ఆనాడు వచ్చిన అవకాశం అప్పుడు తీసుకున్న నిర్ణయం నేటి నాగార్జున విజయ పరంపరకి నాంది.. అప్పటికే ఆనందరావు సర్కిల్‌లోని హోటల్ అమ్మడం ద్వారా తనదగ్గర కొంత డబ్బుంది. మిత్రుల సహాయంతో మరికొంత డబ్బు జమ చేసుకుని రెసిడెన్సీ రోడ్‌లో 1984 డిసెంబర్‌లో నాగార్జున రెస్టారెంట్ నాన్ వెజిటేరియన్ ప్రారంభించారు. అప్పటివరకు ఆయన నడిపింది శాకాహారమే.

కృష్ణారెడ్డికి వండడం రాదు. కానీ ఆయన గంటి పట్టారు. పట్టుదలగా వంటలు నేర్చుకున్నారు. నాగార్జున కృష్ణారెడ్డి బ్రాండ్ అనేలా కొన్ని రుచులను సృష్టించి ఆహార ప్రియులకు వడ్డించేవారు. 'చేసే పనిమీద శ్రద్ధ పెట్టండి, నేను పాఠం చెప్పేటప్పుడు నావైపే చుడండి' అని చిన్నప్పుడు అల్లూరులో చదువుకునేటప్పుడు జివిఎస్ అయ్యవారు చెప్పిన మాటని ఎప్పటికీ మరచిపోలేదు కృష్ణారెడ్డి. తాను ఏ పని చేసిన శ్రద్ధగా చేస్తారు. మనసుపెట్టి చేస్తారు. పట్టుదలగా చేస్తారు. చేసే ప్రతీ పనిలో నాణ్యతకు ప్రాధాన్యత కల్పిస్తారు. ఒకానొక దశలో తన వద్ద ఉన్న వంటవాళ్ళని మరో రెస్టారెంటు యాజమాన్యం ఎక్కువ ఆశపెట్టి రాత్రికి రాత్రి తీసుకుపోయారు. అయినా కృష్ణారెడ్డి జంకలేదు. తన చేతిలో విద్య ఉంది, మళ్ళీ కొత్తవారిని పిలిపించి తానే ట్రైనింగ్ ఇచ్చి తయారు చేసుకున్నారు. ఆయన సంస్థల్లో పనిచేసే సిబ్బందిలో పాతిక శాతం మందికిపైగా 35 సంవత్సరాల నుండి పనిచేస్తున్నవారే.

### వరుస శాఖలు....

గడచిన మూడున్నర దశాబ్దాల కాలంలో ఇప్పటికి మొత్తం 7 బ్రాంచీలను నెలకొల్పారు. వడివడిగా అడుగులు వేయకుండా నిదానమే ప్రధానమన్న సూత్రాన్ని పాటిస్తూ నాగార్జునను విస్తరించుకుంటూ వెళ్లారు. 1984లో రెసిడెన్సీ రోడ్డులో తొలి విజయం వరించాక, దాదాపు పది సంవత్సరాల తరువాత 1994లో రెండవ శాఖను జయనగర్లో ప్రారంభించారు. అప్పట్లోనే 'సావోయ్' పేరుతో ఒక మల్టిక్యుసైన్ రెస్టారెంట్‌ను తెరిచారు. ఆ తరువాత ఇందిరానగర్, కోరమంగళ, బన్నెరగడ్డ రోడ్డు, మార్తహళ్లి ప్రాంతాలలో ఇప్పుడు నోరూరించే నాగార్జున రుచులు అందుబాటులో ఉన్నాయి. తమ శాఖలన్నీ బెంగళూరుకే పరిమితం చేశారు తప్ప సిటీ సరిహద్దులు దాటలేదు.

### స్నేహశీలి...

బెంగళూరులోని బృందావనం హోటల్ కృష్ణారెడ్డి అడ్డా. తన మిత్రులు ఎవరొచ్చినా ఆయన బృందావనంలో కాలక్షేపం చేసేవారు. రోజూ పదులసంఖ్యలో కృష్ణారెడ్డి స్నేహితుల కోసం క్యారియర్‌లో భోజనం బృందావనానికి వెళ్ళాల్సిందే. అంతలా స్నేహధర్మాన్ని పాటించేవారాయన.

రైతు కుటుంబంలో పుట్టి, చిన్నతనంలోనే తండ్రికి దూరమై, చదువు భారమైనా బ్రతుకు బండిని విజయ బాటలో నడిపించిన కృష్ణారెడ్డి కథ స్ఫూర్తిదాయకం. తన బిడ్డల చదువుల కోసం సొంత ఊరు, జిల్లా, రాష్ట్రం వదిలిపెట్టి ఊరు కాని ఊరులో, బెంగళూరు వంటి మహానగరంలో జనం అభిరుచులకు తగ్గ రుచులను అందించి ఆతిథ్య రంగంలో అగ్రతాంబూలం అందుకున్న ధీశాలి కృష్ణారెడ్డి. ఆయన మరణంతో శోకసముద్రంలో ఉన్న వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ... కృష్ణారెడ్డికి నివాళులర్పిస్తోంది 'లాయర్'.





# ఖతార్‌లో.. మన వెంకయ్య మాటలకు జయజయధ్వానాలు

## ఆకట్టుకున్న ఉపరాష్ట్రపతి అద్భుత ప్రసంగం

*భారత ఉపరాష్ట్రపతి, నెల్లూరీయుడు.. మన వెంకయ్యనాయుడి అద్భుత ప్రసంగానికి ఖతార్ దేశంలోని భారత సంతతి ప్రజలు ముగ్ధులైపోయారు. ఉప రాష్ట్రపతి తనదైనశైలిలో అనర్ఘళంగా ప్రసంగిస్తుండగా అక్కడున్న వారంతా ఆ వాక్చాతుర్యానికి ఆశ్చర్యపోతూ ఆయన పట్ల ఎంతో గౌరవభావంతో లేచి నిలబడి జయజయధ్వానాలు చేశారు. వారి కరతాళధ్వనులతో ఆ ప్రాంతమంతా మార్మోగిపోయింది. ఇటీవల గబాన్, సెనెగల్, ఖతార్ దేశాల్లో పర్యటించిన ఉపరాష్ట్రపతి పలు కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతంగా తమ పర్యటన పూర్తిచేసుకుని ఈనెల 7న తిరిగి భారత్‌కు తిరిగివచ్చారు.*

మన వెంకయ్యనాయుడి ప్రసంగం ఎంత అద్భుతంగా ఉంటుందో అందరికీ తెలిసిందే. ఆయన ఉపన్యాసాలు అపూర్వం. అసెంబ్లీలో ఉన్నప్పుడు ఆయన్ను 'అసెంబ్లీ టైగర్' అనేవారంటే ఆయన వాగ్ధాటి ఎంత ఘనంగా ఉంటుందో తెలిసిందే. సున్నితమైన చురకలు.. చెణుకులు ఎదుటివారిని మంత్రముగ్ధులను చేస్తాయి. ఆయన ప్రతి మాటలోనూ ఒక సందేశం ఉంటుంది. తాజాగా తన పర్యటన చివరిరోజున ఖతార్‌లోని భారత సంతతి ప్రజలనుద్దేశించి చేసిన ఉప రాష్ట్రపతి ప్రసంగం అందరినీ బాగా ఆకట్టుకుంది. అందరూ ఎంతో ఆసక్తిగా ఆయన ప్రసంగాన్ని విన్నారు. ఖతార్ దేశప్రజలు కూడా ఆయన ప్రసంగాలను నేరుగా విని ఆయన మాటలకు మురిసిపోయారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి ప్రవాస భారతీయులనుద్దేశించి మాట్లాడారు. తన ప్రసంగంలో ఆయన భారతదేశ ఔన్నత్యాన్ని చాటారు. విభిన్న భాషలు, సంస్కృతులతో అతిపెద్ద జనాభాతో కూడిన భారతదేశంలో ప్రజలు ఐక్యంగా, శాంతి సామరస్యాలతో జీవిస్తుంటారన్నారు. భారత్‌లో సంపూర్ణ ప్రజాస్వామ్యం, భావప్రకటన స్వేచ్ఛ, అన్ని మతాలకు సమానమైన స్వేచ్ఛ ఉన్నాయని, అందరికీ సమాన న్యాయమన్నది భారతీయ సంస్కృతి అని అన్నారు. ప్రపంచంలో భారతీయులు ఎక్కడున్నా మాతృభాషను మరచి పోకూడదన్నారు. ఏ ధర్మం పాటించినా అందరూ భరతమాత బిడ్డలేనని ఆయన అన్నారు. ఖతార్ దేశాభివృద్ధిలో భారత సంతతి కృషిని ఉప రాష్ట్రపతి ఈ సంద ర్భంగా అభినందించారు. శాంతి సామ రస్యాలతోనే పురోగతి సాధ్యమవుతుందని చెప్పారు. ఖతార్‌లో 7.8 లక్షల మంది బలమైన భారతీయ సమాజం ఇరు దేశాల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేస్తోందని, ఖతార్ రెండుదేశాల మధ్య సజీవమైన వంతెనగా నిలిచిందని కొనియాడారు. ఖతార్-భారత్‌లు పలు రంగాల్లో అభివృద్ధికి కలసికట్టుగా ముందుకు నడుస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా ఆయన కొద్దిసేపు తెలుగులో మాట్లాడడంతో అందరూ హర్షధ్వానాలు చేశారు. 'భారత్‌మాతా కీ జై' అంటూ పలువురు యువకులు జేజేలు పలికారు. ఆద్యంతం మన ఉప రాష్ట్రపతి ప్రసంగం ఆ దేశాల్లో ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది.

## మీరు మారండి..

# లేదంటే.. మిమ్మల్నే మార్చేస్తా

### ○ పార్టీ నేతలకు జగన్ ఝలక్!





**వై.ఎస్.ఆర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులకు క్లాసు పీకారు ముఖ్యమంత్రి జగన్. గడప గడపకి మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనని మంత్రులకు, పార్లమెంటు సభ్యులకు, శాసన సభ్యులకు వార్నింగ్ ఇచ్చారు. 'మీ వైఖరి మార్చుకోండి.. లేదంటే మిమ్మల్నే మార్చేస్తా' అంటూ ఝలక్ ఇచ్చారు. మూడేళ్ల ప్రభుత్వ పాలన, పార్టీలో గెలిచినవారి పనితీరు, భవిష్యత్ ప్రణాళిక, పార్టీ పటిష్టత తదితర అంశాలతో కూడిన వర్క్‌షాప్‌లో జగన్ మాట్లాడారు. జూన్8వతేదీ బుధవారం తాడేపల్లిలో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. పనితీరు బాగాలేని వారిని హెచ్చరిస్తూ భవిష్యత్ ప్రణాళికను జగన్ సూచించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా.. మొత్తం 175 సీట్లూ వైసీపీ ఖాతాలో పడేలా ప్రతిఒక్కరు కృషి చేయాలని అన్నారు.**

ఈ వర్క్‌షాప్‌లో జగన్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో 151 స్థానాల్లో జయభేరి మోగించాం.. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ విజయఢంకా మోగించాలన్నారు. ఇదే మన లక్ష్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆ లక్ష్యాన్ని సాధించడం కష్టమేమీ కాదన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటికీ మంచి చేస్తూ చరిత్రలో చెరగని ముద్రవేశామని, నిత్యం ప్రజలతో మమేకమవుతూ వారి ఆశీస్సులు పొంది ప్రజలకు చేదోడువాదోడుగా నిలిస్తే 175 స్థానాల్లోనూ విజయభేరి మోగించగలమని ఆయన మార్గనిర్దేశనం చేశారు. అందుకోసం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమం 8 నెలలపాటు జరుగుతుందని, ఒక్కో సచివాలయం పరిధిలోని గ్రామాల్లో పర్యటించేందుకు రెండు నుంచి మూడురోజుల సమయం పడుతుందని, నెలకు 20రోజుల వంతున 10 సచివాలయాల్లో ఈ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే విజ్ఞాపనలు, వాటి పరిష్కారం అత్యంత ముఖ్యమైనదని అంటూ ఆ ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రత్యేకదృష్టి సారిస్తామన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో కచ్చితంగా రెండుమూడు రోజులు గడప గడపకు కార్యక్రమం రోజూ ఉదయం నుంచి సాయంత్రం 7 గంటల దాకా చేపట్టాలని తెలిపారు.

### అన్ని చోట్లా గెలుపే లక్ష్యం :

'అన్ని చోట్లా గెలుపు' అనేది అసాధ్యమేమీ కాదని, కష్టం కూడా కాదని అంటూ... మనకు ఓటు వేసినవారితో పాటు వేయనివారికి కూడా కులమత వర్గ భేదం లేకుండా, పార్టీలకు అతీతంగా పారదర్శకంగా మేలుచేశామని, ప్రతి ఇంటికీ మంచి చేశామని, ప్రతి ఇంటికీ మేలు జరిగినప్పుడు ప్రజాప్రతినిధులమైన మనకు అంతకంటే ఏంకావాలని సిఎం అన్నారు. ప్రజలకు మంచి చేశామని కాలర్ ఎగరేసి చెప్పుకోగలుగుతున్నామని, దేవుడి దయతో ఇవన్నీ చేయగలిగామన్నారు. అర్హత కలిగిన ప్రతివ్యక్తికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. ప్రతి ఇంటికీ మంచి చేశాం కాబట్టే విజయం చేకూరిందని, అదే రీతిలో 175కు 175 స్థానాలను సాధించగలుగుతామని, ఇది జరగాలంటే.. మనం కష్టపడాలని ముఖ్యమంత్రి వారికి దిశానిర్ధేశం చేశారు.

# 'సేవాభూషణుని'కి ఆత్మీయ సత్కారం



రాజ్యసభ సభ్యులు 'సేవాభూషణ్' వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఈ నెల 6వ తేదీ వారి నివాసంలో గౌరవపూర్వకంగా కలసి ఆత్మీయంగా సత్కరించి, జ్ఞాపికను అందజేస్తున్న 'లాయర్' పత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి (ప్రభు).

# ఇద్దరు మిత్రులు

### పెద్దల సభలో



చిన్ననాటి నుండి మిత్రులైన ఇద్దరు నెల్లూరీయులు ఇప్పుడు పెద్దలసభలో తమ వాణి వినిపించబోతున్నారు. తాజాగా రాజ్యసభకు ఎంపికైన బీద మస్తాన్‌రావు, రెండవ సారి ఎంపికకాబడిన విజయసాయిరెడ్డి ఇద్దరూ మంచి మిత్రులు. కాలేజీలో చదివే రోజుల నుండి ఇద్దరూ స్నేహితులు. ఇద్దరూ కలసి చెన్నైలో ఉద్యోగం కూడా చేశారు. ఆ తరువాత వ్యాపార భాగస్వామ్యులుగా కూడా మారారు. ఇద్దరూ స్థిరపడింది కూడా మదరాసులోనే.

కొన్ని వ్యక్తిగత కారణాలవల్ల విజయసాయిరెడ్డి వ్యాపార రంగం నుండి తన దృష్టిని తన వృత్తి చార్టెర్డ్ అకౌంటెన్సీ వైపు మరల్చారు. మస్తానయ్య మాత్రం ఆక్వా వ్యాపారం లోనే కొనసాగి అంచలంచెలుగా ఎదిగారు. ఓ వైపు వ్యాపారరంగంలో కొనసాగుతూనే మరోవైపు రాజకీయ రంగంలో అడుగుపెట్టారు. ఒక పర్యాయం కావలి శాసనసభ్యుడిగా కూడా ఎన్నికయ్యారు. అప్పటికి విజయసాయిరెడ్డి రాజకీయ ఆరంగేట్రమే చేయలేదు. రాజశేఖరరెడ్డి ఆకస్మిక మరణం తరువాత ఆయన వారసుడిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యక్ష రాజకీయాలలోకి రావడంతో ఆయనకు అత్యంత అంతరంగికుడైన విజయసాయిరెడ్డి కూడా రాజకీయాలలోకి ప్రవేశించారు. తన ఆప్తమిత్రుడు మస్తాన్‌రావు ఎన్నుకున్న రాజకీయ రంగంవైపు అడుగులు వేశారు. మిత్రుడికంటే ముందుగానే పెద్దల సభకు చేరారు. ఇన్నాళ్ళకి మళ్ళీ అనుకోకుండా ఆ ఇద్దరి మిత్రుల బంధం మరింత గట్టిపడింది. ఇప్పుడు మస్తానయ్య కూడా పెద్దల సభకు వెళ్లడంతో ఈ పాత మిత్రుల అనుబంధం కొత్త సాంగత్యంతో మరింత గట్టిపడబోతుందని ఈ ఇద్దరు మిత్రుల సన్నిహితులు సంబరపడుతున్నారు. చిన్నతనం నుండి కలసి నడిచిన, కలసి ప్రయాణించిన ఇద్దరూ మధ్యలో వేరు దారుల్లో నడిచినా చివరికి ఇద్దరూ ఒకే దారిలో పెద్దల సభకు చేరారని వారంతా ఆనందపడుతున్నారు.

## నేత్రపర్వంగా.. చాముండేశ్వరిదేవి బ్రహ్మోత్సవాలు



జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఇందుకూరుపేట మండలం గంగపట్నంలోని శ్రీ చాముండేశ్వరిదేవి అమ్మవారి బ్రహ్మోత్సవాలు గత 4 రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం రాత్రి అమ్మవారికి సింహ వాహనోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. గ్రామంలోని వీధుల్లో అమ్మవారి ఊరేగింపులో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గురువారం పులి వాహనోత్సవంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

లాయర్
జూన్ 10, 2022

# పర్యావరణంపై.. ఊకదంపుడేనా?



మానవ మనుగడకు ప్రకృతి-పర్యావరణమే ప్రాణం. అందువల్ల పర్యావరణ పరిరక్షణ అనేది ఒక మొక్కుబడి కార్యక్రమం కాకూడదు. ఊకదంపుడు ఉపన్యాసాల వల్ల ఫలితం లేదు. ఇప్పటికే మానవ తప్పిదాల వల్ల గాలి, నీరు, ఆహారం.. వాతావరణం అన్నీ కలుషితమైపోతున్నాయి. మనకు ప్రాణమిచ్చి కాపాడే భూమాతను సంరక్షించుకోవడం కంటే ముఖ్యమైన విషయం ఏముంటుంది?.. పర్యావరణ దినోత్సవాల స్ఫూర్తి ఒకరోజుని కాదు.. నిరంతరం కొనసాగాలి. సకల మానవాళి ఈ ధరిత్రిని కంటికి రెప్పలా కాపాడుకోవాలి. అప్పుడే పర్యావరణ దినోత్సవానికి అసలైన సార్థకత.

**జూన్-5** ప్రపంచ పర్యావరణ దినోత్సవం కనుక ఆరోజున దేశవ్యాప్తంగానే కాదు ప్రపంచవ్యాప్తంగా అనేకమంది మొక్కల పెంపకం, పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణం అంటూ హడావుడిగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుండడం సంతోషకరమే కానీ..అవన్నీ చాలామటుకు ఆరోజుకారోజు మొక్కుబడి ప్రహసనంగా ముగిసిపోతుండడమే విచారకరం. ఎక్కడో కొన్ని ప్రాంతాల్లో మినహా అన్నిచోట్లా ఈ కార్యక్రమాలు కూడా అంతంతమాత్రంగానే జరుగుతున్నాయి. మానవాళి మనుగడకు ప్రాణాధారమైన పర్యావరణ పరిరక్షణ అనేది, పచ్చదనాన్ని కాపాడుకోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమన్నవి నిరంతరం నిలుపు లేకుండా జరగాల్సిన పనులు. జూన్-5ను ఒక ల్యాండ్‌మార్కుగా తీసుకుని పర్యావరణానికి ఎక్కడా ముప్పు రాకుండా ప్రతి ఒక్కరూ ఒక బాధ్యతగా చూసుకోవాలన్నది సారాంశం. అందుకే అంతర్జాతీయ స్థాయిలో ఐక్య రాజ్య సమితి స్వీడన్‌లో 1972 జూన్ 5 నుంచి 16వ తేది వరకు పర్యావరణ పరిరక్షణ సదస్సు పెట్టి, వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు మానవాళి అంతా అప్రమత్తంగా ఉండాలని సూచించిది. అదే ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా జూన్ 5ను పరిగణించాలని ప్రకటించింది. 1973లో తొలిసారిగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ప్రపంచమంతా జరుపుకోవడం కూడా ప్రారంభమైంది. దీనిద్వారా కొంతమేరకు మానవాళిలో కదలిక వచ్చిందనేది వాస్తవం. పర్యావరణం పట్ల మునుపటి కంటే ఇప్పుడు ప్రజల్లోనూ మంచి అవగాహన కలుగుతోంది కూడా. ప్రచార, ప్రసార మాధ్యమాలు, సాంకేతిక పరిజ్ఞానం బాగా అందుబాటులోకి రావడం అందుకు కారణంగా చెప్పుకోవచ్చు. ఎప్పుడో 50 ఏళ్ల క్రితమే ప్రారంభమైన పర్యావరణ దినోత్సవానికి ఇప్పుడు 50 వసంతాలు నిండాయంటే ఆనందమే. అందుకే ఈ దినోత్సవం ఈసారి 'పర్యావరణ స్వర్ణోత్సవం' అయింది. ప్రతి ఏటా ఏదో పర్యావరణ అంశాన్ని సూచించే ఐరాస (ఐక్యరాజ్య సమితి) ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఈ ఏడాది 'ఓన్లీ ఒన్ ఎర్త్' (ఒక్కటే భూమి..అందరం ఒక్కటై కాపాడుకుందాం) అనే నినాదంతో పర్యావరణ పరిరక్షణకు ప్రపంచదేశాలన్నీ కంకణబద్ధులు కావాలని పిలుపుచ్చింది. మానవాళికి ఆధారమైన ధరిత్రిని కాపాడుకోవాలన్నదే ఇందులోని ధ్యేయం. ఇది ఒకరోజుతో జరిగే పని కాదు. నిరంతర ప్రక్రియగా ఉండాలి. అయితే వాస్తవానికి పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి. ప్రపంచమంతటా కాలుష్యం కోరలు చాస్తూనే ఉంది. మానవ తప్పిదాల వల్లనే గాలి, నీరు, ఆహారం.. వాతావరణం అన్నీ కలుషితమైపోతున్నాయి. ఈ కాలుష్యాల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారని నిపుణుల అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. అందువల్ల పర్యావరణంపై మొక్కుబడి విధానాలు, ఊకదంపుడు ఉపన్యాసాలు వద్దు. రోగాల బారిన పడకుండా..అన్ని రకాల కాలుష్య కారకాలను నివారించుకోవాలి. మన పరిసరాలను నిత్యం మనమే పరిశుభ్రం చేసుకోవాలి. ఇది మానవాళి తక్షణ కర్తవ్యం. కర్బన ఉద్గారాల వల్ల భూమిపై ఉష్ణోగ్రత బాగా పెరిగిపోతోంది. వాటిని తగ్గించుకోకపోతే భూమండలానికే ముప్పు. సాగరాలు, నదులు కూడా కాలుష్యానికి గురవుతున్నాయి. కాలుష్యం లేని చోటే భూమ్మీద కనిపించడం లేదు. రసాయన ఎరువులను, ప్లాస్టిక్ వినియోగాన్ని మానేయాలని, కాలుష్యం నివారించేందుకు విద్యుత్ వాహనాలు ఉపయోగించుకోవాలని నిపుణుల సూచన. పర్యావరణం కోసం అడవులను విస్తారంగా పెంచాలి. ప్రతి ప్రాంతంలోనూ మొక్కలను విరివిగా నాటి సంరక్షించుకోవాలి. పచ్చని చెట్లే.ప్రగతికి మెట్లని గుర్తుంచుకోవాలి. నేలతల్లి చల్లగా ఉంటేనే మానవాళి పదికాలాల పాటు చల్లగా ఉంటుంది. మనకు స్వచ్ఛమైన గాలిని, నీటిని ప్రసాదించి మన ప్రాణాలను కాపాడే భూమాతను సంరక్షించుకోవడం కంటే ముఖ్యమైన విషయం మరొకటి ఏముంటుంది?..పర్యావరణ దినోత్సవాల వంటివి మనకు స్ఫూర్తినిచ్చే ప్రేరకాలు. ఆ స్ఫూర్తిని నిరంతరం కొనసాగించుకోవాలి. అన్ని రోజులూ పర్యావరణ దినోత్సవాలే అనుకుని..ప్రతినిత్యం పర్యావరణ పరిరక్షణ మన శ్వాసగా..ధ్యాసగా మారిపోవాలి. అప్పుడే పర్యావరణ దినోత్సవానికి అసలైన సార్థకత. సకల మానవాళి ఈ ధరిత్రిని కంటికి రెప్పలా కాపాడుకోవాలి. ఈ నేల మనందరిదీ.. దీనిని కాపాడుకోవడమే మనందరి విధి!..

# మీడియా మారాలి...!

వార్తా పత్రికలు, టీవీ చానెళ్ళు ఇప్పుడు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ప్రభుత్వాలకి ప్రజలకి మధ్య వారధి మీడియా. సమాజంలో జరిగే అవినీతి కార్యక్రమాలను, అసాంఘిక కార్యకలాపాలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి వాటిని చైతన్య పరచవలసిన బాధ్యత మీడియాది. ప్రజలకు సేవలందించాల్సిన వ్యవస్థలు నిద్రమత్తులో జోగుతుంటే వాటిని తట్టిలేపే సాధనం మీడియా. రాజకీయపార్టీలు వాటి నాయకులు, ప్రభుత్వరంగ విభాగాలూ అక్రమాలకు పాల్పడుతుంటే... తమ కలం, బలం ద్వారా వాటిని ధీటుగా ఎదుర్కొనే ఆయుధం మీడియా. అలాంటి మీడియా ఇప్పుడు చప్పబడిపోయింది. స్వార్థపూరితమైపోయింది. వ్యక్తిగత లాభాల కోసం ప్రజా ప్రయోజనాలను గాలికి వదిలేసి అభాసుపాలైపోతుంది. రాజకీయ పార్టీలు సైతం తమకోసం సొంత పత్రికలను చానెళ్లను పెట్టుకుని తమకు తాము భజన చేసుకుంటున్నాయి. పార్టీలకు, పార్టీ అధినేతలకు ఏ సంబంధం లేని చానెళ్ళు, పత్రికలు నిష్పక్షపాత వైఖరి విధానానికి నీళ్లొదిలి ఏకపక్షంగా వార్తలను అందిస్తున్నారు. తాము ఎన్నుకున్న పార్టీలకి కొమ్ముకాస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. ప్రతి రాష్ట్రంలోనూ ఇదే తంతు. ఒకప్పుడు జర్నలిజం అంటే అత్యంత పవిత్రమైన వృత్తిగా భావించేవారు. కానీ నేటి పరిస్థితులలో జర్నలిజం ఎర్నలిజంగా మారిపోవడంతో సమాజంలో పాత్రికేయుల విలువ పడిపోయింది. మీడియాపై ప్రజలలో చిన్నచూపు ఏర్పడిపోయింది. మీడియా మారాలి. ఉన్నత విలువలు కలిగిన సమాచార సాధనాలుగా మీడియా సంస్థలు అవతరించాలి.

*రాణిభరద్వాజ్,* **నెల్లూరు.**

# మా యూనివర్సిటీని ఆదుకోండి!

నేను విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో చదువుకున్నాను. ఇక్కడ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది చిత్తశుద్ధితో, అంకిత భావంతో పనిచేస్తున్నారు. విద్య పరంగా మంచి ఫలితాలను సాధిస్తోంది మా విశ్వవిద్యాలయం. ఇక్కడ వసతులు సరిగ్గా లేవు. ప్రభుత్వం ఆర్థికంగా సహకరించకపోవడంతో పూర్తిస్థాయిలో మౌలికసదుపాయాల కల్పన జరగలేదు. ఇటీవల జరిగిన స్నాతకోత్సవంలో కూడా మేమంతా మండుటెండలో టెంట్ల క్రింద కూర్చుని గవర్నర్ గారి నుండి పట్టాలు అందుకోవలసి వచ్చింది. కనీసం ఒక ఆడిటోరియం కూడా లేదు. పూర్తిస్థాయిలో తరగతి గదులు కూడా లేవు. దాతృత్వానికి మారు పేరు నెల్లూరుజిల్లా అంటారు. ఈ జిల్లా నుండి బయట ప్రాంతాలకు వెళ్ళి ఆర్థికంగా స్థిరపడిన వాళ్ళు వందలమంది ఉన్నారని పలు సందర్భాలాలో విన్నాను. దాతలు సహృదయంతో ముందుకొచ్చి మా విశ్వవిద్యాలయం అభివృద్ధికి తోడ్పడవలసిందిగా వేడుకుంటున్నాను.

*ఓ పూర్వ విద్యార్థిని,* **విక్రమ సింహపురి యూనివర్సిటీ.**

## ర్యాంకుల ప్రచారాన్ని అడ్డుకుని

# ప్రభుత్వం మంచిపని చేసింది!

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

గత కొన్ని దశాబ్దాలుగా 10వ తరగతి మొదలుకొని ఎంసెట్ వంటి ప్రవేశపరీక్షల వరకూ ఏ పరీక్షా ఫలితాలు వచ్చినా ఒక తిరునాళ్ళలాగా ఉండేది. టీవీ చానెళ్లలో, వార్తా పత్రికలలో ర్యాంకుల జాతరను ఊదరగొట్టేవారు. పదవ తరగతి పాసైన వారిని ఇంటర్మీడియట్ కాలేజీలు, ఇంటర్ పాసైన వారిని కోచింగ్ సెంటర్లు సంతలో పశువులను కొన్నట్లు వేలం వేసి కొనేవాళ్ళు. పేరెంట్స్ కూడా తమ పిల్లలని వారికి అమ్మడానికి వెనుకాడేవారు కాదు. ఇప్పుడు అలాంటి విధానానికి ప్రభుత్వం బ్రేకులు వేసింది. అలా ఫలితాలను ఆర్భాటంగా ప్రచారం చేసుకోవడానికి వీలులేదని గట్టిగా హెచ్చరించింది. నిబంధనలు ఉల్లంఘిస్తే ఏడేళ్ళు జైలుశిక్ష విధిస్తామంటూ భయపెట్టింది. దీంతో ఇటీవల 10వ తరగతి పరీక్షలు వెలువడినా ఎక్కడా హడావుడి లేదు. టీవీలలో రచ్చ లేదు. పత్రికలలో పేజీలకొద్దీ ప్రకటనలు లేవు. ఈ విషయంలో ప్రభుత్వం మంచిపని చేసింది.


*పి. కిరణ్మయి,* **నాయుడుపేట.**

# రాజకీయాలంటే ఎందుకంత వ్యామోహం!

యుక్త వయసులోనే ఉన్నత స్థానానికి ఎదిగి మంత్రిగా మంచి పేరు తెచ్చుకున్న మేకపాటి గౌతమ్‌రెడ్డి హఠాత్తుగా చనిపోవడం చాలా బాధాకరం. చేతికి అందివచ్చిన చెట్టంత కుమారుడు కళ్ళముందే కుప్పకూలిపోవడాన్ని చూడవలసి రావడం కన్నవారికెవరికైనా తీర్చలేని శోకమే. అయితే... కుమారుడు అశువులు బాసిన అతి కొద్దిరోజులకే గౌతమ్ తండ్రి రాజమోహన్‌రెడ్డి రాజకీయాలపై ఆసక్తి చూపడం, రెండవకుమారుడిని వెంటబెట్టుకుని తిరగడం చూస్తే ఆశ్చర్యమేస్తుంది. కన్నతల్లి, తండ్రి లేదా కట్టుకున్న భార్యో, భర్తో పోతేనే కనీసం ఏడాదిపాటైనా బాహ్యప్రపంచంలోకి రావడానికి ఇష్టపడని సంస్కృతి మనది. అలాంటిది కొడుకుని పోగొట్టుకున్న అతి కొద్దిరోజులకే రాజకీయం వేదికగా ప్రజాక్షేత్రంలోకి వచ్చేశారు పెద్దాయన. మరపు మనిషికి దేవుడిచ్చిన వరం అంటారు. కానీ, ఇప్పుడా మరుపును మించిన రాజకీయ వ్యామోహం బిడ్డ మరణాన్ని కూడా అతి తొందరగా మర్చిపోయేలా చేసింది. రాజకీయాలపై మోజు, పదవులపై కాంక్ష మనిషిని ఎంతటి స్థాయికైనా తీసుకెళ్తాయనడానికి ఈ ఆత్మకూరు ఉపఎన్నికే పెద్ద ఉదాహరణ...!

*ఆర్. పి. రామయ్య,* **కొండాయపాలెం.**

# వెలగని లైట్లు - చీకట్లో ఫీట్లు



పేరు గొప్ప - ఊరు దిబ్బ అన్న చందంగా తయారయ్యింది నెల్లూరు నగర కార్పొరేషన్. ప్రజల మెడలు వంచి రెండు రూపాయల వడ్డీతో పన్నులు వసూలు చేయడంపై ఉన్న శ్రద్ధ వసతులు కల్పించడంలో కనిపించడం లేదు. నగరంలోని అనేక కాలనీలలో వీధిలైట్లు వెలగడం లేదు. సెంటర్ లైటింగ్, స్ట్రీట్ లైటింగ్ అంటూ నేతలు ఆర్భాటంగా ప్రారంభిస్తున్నారు తప్ప అవి వెలుగుతున్నాయా లేదా అని పట్టించుకోవడంలేదు. శాసన

## సమస్యల తో 'రణం'

సభ్యులు, కార్పొరేటర్లు గడప-గడప కార్యక్రమంలో ప్రజలమధ్యకు వచ్చినప్పుడు వీధిలైట్ల సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం కనిపించడం లేదు. ముఖ్యంగా నగర శివార్లలో చాలా ప్రాంతాలలో ఈ సమస్య ఎక్కువగా ఉంది. బ్రతుకుదెరువు కోసం ఇంటి నుండి ఉదయాన్నే వెళ్ళి మళ్ళీ ఏ రాత్రో ఇళ్లకు తిరిగి వచ్చే అనేకమంది శ్రమజీవులు చీకట్లలోనే ఫీట్లు చేయాల్సివస్తోంది. గుంతలమయమైన రోడ్లు, విచ్చలవిడిగా కుక్కలు, వీటికి తగ్గట్లుగా అక్కడక్కడా పాములు. ఇలాంటి పరిస్థితులలో రాత్రి వేళల్లో బిక్కు బిక్కుమంటూ ఇళ్లకు చేరవలసి వస్తోంది. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని ప్రగల్భాలు పలికే నేతలు, అధికారులు ముందు ఇలాంటి సమస్యాత్మక విషయాలపై దృష్టి సారిస్తే మంచిది. ఏదైనా జరగరాని సంఘటన జరిగితే అప్పుడు నాలిక కరచుకుని పరుగులు తీస్తుంది అధికార గణం. అదేదో ముందే మేల్కొని సమస్యను పరిష్కరిస్తే సరిపోతుంది కదా...! చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏం ప్రయోజనం...?

**- సంచారి**

## సాగరాలను
# సంరక్షించుకోవాలి



ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నెల్లూరు జిల్లాశాఖ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా నెల్లూరులో పర్యావరణంపై అవగాహన ర్యాలీతో పాటు మైపాడు సముద్ర తీరం ఆవరణంలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. రెడ్‌క్రాస్ కార్యాలయం ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలని, మొక్కలు నాటి సంరక్షించుకోవాలని అన్నారు. సముద్రాలు, నదులను కూడా జాగ్రత్తగా పరిరక్షించుకోవాలని.. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. స్వాస్టిక్ సెంటర్ ప్రిన్సిపాల్ గురునాథం, సెక్రటరీ మస్తానయ్య, సీనియర్ స్టేట్ కో-ఆర్డినేటర్ గంట రవి కుమార్, వంశీకృష్ణ, శివప్రసాద్ సాయిరాం, వాలంటీర్లు పాల్గొన్నారు.



కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' పత్రిక

# లాయర్ @ 42

స్థానిక పత్రికా ప్రపంచంలో
41 వసంతాలు దిగ్విజయంగా పూర్తి చేసుకుని
జూన్ 5, 2022న 42వ పడిలో అడుగిడిన

**లాయర్**
**పత్రికకు**
వార్షికోత్సవ శుభాకాంక్షలు.

SMD HOMES
Value beyond Bricks
Bangalore | Tirupathi | Nellore

జిల్లా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా..

# అమరజీవికి నివాళి



అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని, ఆయన ఆశయాల బాటలో అందరం నడవాలని అంతర్జాతీయ వైశ్యసమాఖ్య ఉపాధ్యక్షులు కెవి చలమయ్య అన్నారు. ఆ త్యాగమయునికి భారత రత్న ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జూన్ 4న శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా ఆవిర్భావం జరిగి ఇప్పటికి 14 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా స్థానిక నాయకులు, వైశ్య సంఘాల వారు శ్రీ పొట్టి శ్రీరాములును స్మరించుకున్నారు. నెల్లూరులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు ఆర్‌వి శరత్, నగరకంటి రవీంద్ర, సోలేటి నాగేశ్వరరావు, సోమిశెట్టి వెంకటరత్నం, రాయవరపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వెన్నెలకంటి రాఘవయ్యకి ఐటిడిఏ నివాళి



యానాదుల సంక్షేమానికి, ఆదిమజాతుల సముద్ధరణకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు వెన్నెలకంటి రాఘవయ్య అని, ఆయన చిరస్మరణీయుడని ఐటిడిఏ పి.ఓ డాక్టర్ మందా రాణి అన్నారు. ఈనెల 4న ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, యానాదుల దేవుడు వెన్నెలకంటి రాఘవయ్య 125వ జయంతి కార్యక్రమం నెల్లూరులోని ఐటిడిఏ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రిటిష్ వారి కాలంలో గిరిజనులకు శాపంగా మారిన ట్రైబల్‌యాక్ట్‌ను రద్దు చేసేందుకు వెన్నెలకంటి రాఘవయ్య చేసిన కృషి అమోఘమని, ఆదిమజాతుల అభ్యున్నతి కోసం రాఘవయ్య తనకున్న ఆస్తిపాస్తులన్నిటినీ అర్పించారని, యానాదుల బిడ్డల చదువుల కోసం హాస్టళ్ళు ఏర్పాటుచేసి వారి జీవితాల్లో వెలుగుబాటలు వేశారని కొనియాడారు. తొలుత ఆమె వెన్నెలకంటి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఐటిడిఏ సిబ్బంది పాల్గొన్నారు.

# రెజ్లింగ్ అసోసియేషన్‌కు.. కొత్త కార్యవర్గం

జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్‌కు ఈనెల 5న కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా పి.వేణుగోపాల్‌రెడ్డి, ప్రెసిడెంట్‌గా వెంకటఅజయ్, వైస్ ప్రెసిడెంట్‌గా శేషసాయిప్రసాద్, సెక్రటరీగా నాగేంద్రరావు, జాయింట్ సెక్రటరీలుగా ప్రభావతి, సందీప్‌కుమార్, ట్రెజరర్‌గా గోపి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా చలపతి, సత్యసాయి బ్రహ్మ ఎన్నికయ్యారు.

# పెరసం ఆధ్వర్యంలో కవిసమ్మేళనం



నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం (పెరసం) ఆధ్వర్యంలో ఈనెల 5న కవిసమ్మేళనం జరిగింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని జాషువా గ్రంథాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెరసం అధ్యక్షుడు అవ్వారు శ్రీధర్‌బాబు అధ్యక్షత వహించారు. కవులు, కవయిత్రులు హస్తి లక్ష్మణరాజు, అంకబాబు, ఇసనాక దయాకర్‌రెడ్డి, బొగ్గరపు ఇందిర, నజ్మా, అరుణ, శివకృష్ణ, కోటిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొని కవితాపఠనం చేశారు. అనంతరం జంజం కోదండరామయ్య రచించిన 'జీవితసత్యాలు' మినీకథల సంపుటిని పెరసం ప్రధాన కార్యదర్శి తోట సులోచన ఆవిష్కరించారు. పెరసం వ్యవస్థాపక అధ్యక్షుడు మోపూరు పెంచలనరసింహం, గోవిందరాజు సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.




# నెల్లూరు కబుర్లు

# ఉప ఎన్నిక పరిశీలకునిగా.. సురేష్‌కుమార్



ఆత్మకూరు ఉప ఎన్నికల జనరల్ అబ్జర్వర్ (పరిశీలకులు)గా సురేష్‌కుమార్ నియమితులయ్యారు. ఆయన ఈనెల 6న నెల్లూరుకు రావడంతో జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు వెళ్ళి గౌరవపూర్వకంగా కలిశారు. ఆ తర్వాత ఇద్దరూ ఉప ఎన్నికల నిర్వహణ అంశంపై చర్చించుకున్నారు.

ఒక్క అవకాశం అన్నారు..

# త్రీడీ చూపిస్తున్నారు

- వైకాపాపై జనసేన మనుక్రాంత్ ధ్వజం



ఒక్క అవకాశం ఇవ్వాలంటూ వచ్చిన వైకాపా వారు అధికారంలోకి వచ్చాక అందినకాడికి దోచుకుంటున్నారని, దోపిడీ–దౌర్జన్యం–దగాలతో జనానికి త్రీ–డీ చూపిస్తున్నారని, ప్రజల సమస్యలు అసలు పట్టించుకోవడం లేదని జిల్లా జనసేన అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్ ధ్వజమెత్తారు. ఈనెల 7న ఆయన నెల్లూరు రూరల్‌లోని 25వ డివిజన్ కల్లూరుపల్లిలో పర్యటించి ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఆయనకు తమ సమస్యలను విన్నవించారు. తాము కార్పొరేషన్ పరిధిలో ఉన్నప్పటికీ ఇక్కడి రోడ్లంతా పరమ అధ్వాన్నంగా ఉన్నాయని, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదని, పరిసరాలన్నీ అపరిశుభ్రంగా ఉన్నా పట్టించుకునే నాధులే లేరని వారు తెలిపారు. ప్రజలు తెలిపిన సమస్యలను తాము నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరిస్తామని మనుక్రాంత్ వారికి చెప్పారు. జనసేన నాయకుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి నేత రవిచంద్ర అరెస్ట్ దారుణం

మాచర్ల నియోజకవర్గంలో హత్యకు గురైన కంచర్ల జల్లయ్య అంత్యక్రియలకు వెళ్తున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రను పోలీసులు అరెస్టు చేయడం దారుణమంటూ టిడిపి నగర నాయకుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి సిఎం అయ్యాక పోలీసులు వైకాపా కార్యకర్తలుగా ప్రవర్తిస్తున్నారంటూ ఆయన విమర్శించారు. వైకాపా ప్రభుత్వానికి ప్రజలే తగు గుణపాఠం చెప్తారన్నారు.

# ఉద్యోగ ఖాళీలు భర్తీచేయండి

- కలెక్టర్‌కు తెలుగుయువత వినతి



జిల్లాలో ఉన్న వేలాది ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీచేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు కాకర్ల తిరుమలరావు జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబును కోరారు. ఈనెల 6న ఆయన కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగాలు లేక ఎందరో నిరుద్యోగులు కష్టాలు పడుతున్నారని, డిఎస్‌సి, గ్రూప్స్, పోలీసుశాఖల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీచేసి వారిని ఆదుకోవాలని విజ్ఞప్తిచేశారు. తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి దయాకర్‌గౌడ్, అమ్ముల్లా, వేణు, రఫీ, దేవ, అనిల్, సునీల్, పేరయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.



విఎస్‌యులో మొక్కలు నాటుతున్న కలెక్టర్, పక్కన విఎస్‌యు వీసీ సుందరవల్లి

# పర్యావరణ పరిరక్షణ.. అందరి ధ్యేయం కావాలి

విఎస్‌యులో కలెక్టర్ చక్రధర్‌బాబు

పర్యావరణానికి ఎలాంటి ముప్పు వాటిల్లకుండా అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలు నాటి పచ్చదనాన్ని కాపాడుకోవాలని, పర్యావరణ పరిరక్షణ అందరి ధ్యేయం కావాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు చెప్పారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈనెల 5న నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం (విఎస్‌యు) ప్రాంగణంలో కలెక్టర్ మొక్కలు నాటారు. విఎస్‌యు ప్రాంగణమంతా పచ్చనిచెట్లతో కళకళలాడేలా తీర్చిదిద్దుతున్నామని ఈ కార్యక్రమంలో పాల్గొన్న విఎస్‌యు ఉపకులపతి ఆచార్య జిఎం సుందరవల్లి తెలిపారు. విఎస్‌యులో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తున్నామని ఆమె ఈ సందర్భంగా ప్రకటించారు. డిఎఫ్ఓ షణ్ముఖకుమార్, రిజిస్ట్రార్ డా.ఎల్వీ కృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఉదయ్‌శంకర్, మధుమతి, నీలమణికంఠ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఆరోగ్యాధికారిగా

# డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి



నెల్లూరు కార్పొరేషన్ ఆరోగ్యాధికారిగా డాక్టర్ సి. అమరేంద్రనాథ్‌రెడ్డిని పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర పురపాలక శాఖ ఉన్నతాధికారులు ఆమేరకు ఈనెల 4న ఉత్తర్వులిచ్చారు. అదే రోజున ఆయన కార్పొరేషన్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. జిల్లాలోని వరిగొండ పిహెచ్‌సిలో ఆయన మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ, కోవిడ్ ప్రత్యేకవైద్యునిగా నెల్లూరులోని డిఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలోనూ పనిచేశారు. బదిలీపై ఇప్పుడు కార్పొరేషన్‌కు వచ్చారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, మేనేజర్ రాజేంద్రప్రసాద్ తదితరులు ఆయన్ను అభినందించారు. కొత్త ఎంహెచ్ఓ డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డికి 'లాయర్' శుభాకాంక్షలు.

# 'చింతలపాటి' వారికి.. విశిష్ట పురస్కారం



మహా పండితులు, నెల్లూరు మూలాపేటలోని వేదసంస్కృత కళాశాల విశ్రాంత ప్రధానోపన్యాసకులు, మహామహోపాధ్యాయ బిరుదాంకితులు చింతలపాటి పూర్ణానందశాస్త్రికి ఇటీవల ఘనమైన పురస్కారం లభించింది. వరంగల్‌కు చెందిన మహా కవిపండితులు, మహాజ్ఞానసంపన్నులైన శ్రీరంగం నల్లాం చక్రవర్తుల రఘునాథాచార్యుల వారి 97వ జయంతి సందర్భంగా ఎంతో ప్రతిష్ఠాత్మకమైన 'రఘునాథ దేశికవి విశిష్ట పురస్కారం'ను ఆయనకు ఈనెల 5న ప్రదానం చేశారు. ఆ పురస్కార కార్యక్రమం ప్రతినిధి సముద్రాల శఠకోపాచార్యులు నెల్లూరులోని చింతలపాటి వారి నివాసానికి విచ్చేసి ఈ పురస్కారాన్ని అందజేయడం విశేషం. రఘునాథాచార్యుల వారు గొప్ప పండితులని, వరంగల్‌లో వేదపాఠశాలను నిర్వహించడమే కాక 'సత్సంప్రదాయ సభ' తరపున అనేక ఆధ్యాత్మిక గ్రంథాలను వెలుగులోకి తెచ్చారని, వారు అత్యద్భుతంగా రచించిన 'విష్ణుసహస్రనామం స్తోత్రానికి 1200 పేజీల బృహత్తర వ్యాఖ్యానం' పాఠకలోకంలో విశేషాదరణ పొందిందని, అలాంటి మహనీయుని జ్ఞాపకంగా ప్రదానం చేసే పురస్కారాన్ని చింతలపాటి వారికి బహుకరించడం సంతోషకరమని వారి శిష్యులు ఆనందించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు వేద సంస్కృత కళాశాల విశ్రాంత అధ్యాపకులు డా.కందాళ లక్ష్మీనారాయణ, ప్రముఖ పండితులు కిడాంబి రామానుజాచార్యులు, అవధాని కోట రాజశేఖర్, పూర్ణానందశాస్త్రి శిష్యులు, సంస్కృతభారతి సభ్యులు రాజేష్‌ప్రభు, రవికిరణ్‌పాయ్, శ్రీనివాస్, శివకుమార్ పాల్గొన్నారు.

# ఆలయాల విగ్రహ ప్రతిష్ఠలో.. ఎంపీ ఆదాల



నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఇటీవల కొడవలూరు మండలంలోని కమ్మపాలెంలో జరిగిన అయిదు ఆలయాల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయాల్లో శ్రీ విజయ గణపతి, పోలేరమ్మ తల్లి, అభయ ఆంజనేయస్వామి, సంతాన నాగులు, పోతురాజు స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠలు జరిగాయి. ఈ సందర్భంగా వేద పండితులు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఆశీర్వదించారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, డిసిఎంఎస్ అధ్యక్షుడు వీరి చలపతిరావు, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మాజీ కార్పొరేటర్ స్వర్ణ వెంకయ్య, జడ్పీటిసి సుధాకర్‌రెడ్డి, దేవిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నరసింహారావు, మధు, శ్రీనివాసులురెడ్డి, ఆలయ నిర్మాణకర్త సర్పంచ్ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఆత్మకూరు ఉప ఎన్నికలకు..

# 15 నామినేషన్ల ఆమోదం - 13 తిరస్కరణ

ఆత్మకూరు ఉప ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల పరిశీలన ఘట్టం ఈనెల7న ముగిసింది. ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరేందిరప్రసాద్ నామినేషన్లు వేసినవారి సమక్షంలో అన్ని పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 28 మంది నామినేషన్లు వేశారని, వివిధ కారణాలతో 13 నామినేషన్లు తిరస్కరించామని, 15 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించామని చెప్పారు. నామినేషన్ల పరిశీలన ప్రక్రియను ఎన్నికల జనరల్ అబ్జర్వర్ సురేష్‌కుమార్ పర్యవేక్షించారు. ఆత్మకూరు ఇన్‌చార్జి ఆర్‌ఓ బాపిరెడ్డి పాల్గొన్నారు.

**ఆమోదం పొందిన నామినేషన్లు :**

మేకపాటి విక్రమ్‌రెడ్డి (వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ), గుండ్లపల్లి భరత్‌కుమార్ (భారతీయ జనతా పార్టీ), నందా ఓబులేశు (బిఎస్పీ), షేక్ జలీల్ (నవరంగ్ కాంగ్రెస్), షేక్ మొయినుద్దీన్ (ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్), బందారు రవి (హర్దామ్ మన్వట్టాడి రాష్ట్రీయదళ్), పెయ్యల హజరత్తయ్య (జనం మనం పార్టీ), షేక్ మహబూబ్ బాషా(అన్న వైఎస్సార్ కాంగ్రెస్)లతో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా బొర్రా సుబ్బారెడ్డి, బూరగ రత్నం, చల్లా పెంచలమోహన్, పెనాక అమర్‌నాథ్‌రెడ్డి, రావులకొల్లు మాలకొండయ్య, తూమాటి శశిధర్‌రెడ్డి, లాలి వెంకటయ్య నామినేషన్లు ఆమోదం పొందాయి.



# శ్రీసిటీలో పర్యావరణ దినోత్సవం

జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శ్రీసిటీలో వేడుకలు నిర్వహించారు. శ్రీసిటీ ఉద్యాన అధికారి మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సత్యవేడు ఫారెస్ట్ రేంజర్ ప్రసాద్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'ఒకే ఒక భూమి' అనే అంశం ఆధారంగా ఈ ఏడాది వేడుకలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిస్థితులపై అవగాహన కల్పించేందుకు, ప్రజలను ప్రోత్సహించేందుకు ప్రపంచ వ్యాప్తంగా 'పర్యావరణ దినోత్సవం' నిర్వహిస్తున్నారన్నారు. శ్రీసిటీలో తీసుకుంటున్న పర్యావరణ హిత చర్యలను ప్రశంసించారు. భూమి వివిధ జీవ జాతులకు నిలయమని, మనందరం ఆహారం, గాలి, నీరు మరియు ఇతర నిత్యావసరాల కోసం పర్యావరణంపై ఆధారపడుతున్నామని, అయితే పలు కారణాల వల్ల మన పర్యావరణ వ్యవస్థ మారిపోతూ ఉండడంతో గత కొన్ని దశాబ్దాలుగా జీవులకు నష్టం కలుగుతోందని ఈ సందర్భంగా శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. అందుకే ప్రతి వ్యక్తి పర్యావరణాన్ని సంరక్షించడం అవసరమన్నారు. శ్రీసిటీ కమ్యూనిటీలో పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహనను పెంపొందించడానికి, మొక్కలు నాటే ప్రక్రియను ప్రోత్సహించడానికి, పచ్చదనాన్ని అభివృద్ధి చేయడానికి తాము నిరంతరం కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

# ప్రగతి చారిటీస్‌కు.. విపిఆర్ చేయూత

## ఆనవాయితీగా 3 లక్షలు అందించిన వేమిరెడ్డి దంపతులు



ధనం ఎంతున్నా.. దానగుణం లేకుంటే వ్యర్థం. ధనంతో పాటు పదుగురికీ చేయూతనందించే గుణం ఉన్నప్పుడే ఆ ధనానికి సార్థకత లభిస్తుంది. అందుకు ప్రతీకగా ఉంటున్నారు నెల్లూరులోని వేమిరెడ్డి దంపతులు. అందులోనూ దీనుల పట్ల, పేదల పట్ల, దివ్యాంగుల పట్ల తమకున్న ఆదరాభిమానంతో వారి సంక్షేమం కోసం వారు లక్షలాది రూపాయలు వెచ్చిస్తూనే ఉన్నారు. ఈ వితరణల్లో భాగంగా ప్రగతి చారిటీస్‌కు 3 లక్షల రూపాయలను విరాళంగా అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు రాజ్యసభ సభ్యులు, 'సేవా భూషణ్' వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి ఉత్తరభారతదేశంలోని తిరుమల తిరుపతి దేవస్థానాల స్థానిక సలహా మండలి ఛైర్మెన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి. ఈనెల 7న నెల్లూరులోని ప్రగతి చారిటీస్‌కి ఆ విరాళం చెక్కును వారు అందజేశారు. అటు మానసికంగా, ఇటు శారీరకంగా బాధపడుతూ, పుట్టుకతోనే అంగవైకల్యంతో నానాయాతనలు పడుతూ కష్టాలమయంగా జీవితాలను సాగిస్తున్న అనేక మంది చిన్నారులకు చేయూతనందించి పుణ్యం కట్టుకుంటున్నారు విపిఆర్ దంపతులు. దాదాపు 15 సంవత్సరాలుగా ప్రగతి చారిటీస్‌లోని దివ్యాంగులైన చిన్నారుల సంరక్షణ కోసం ప్రతిఏటా విరాళాలు వీరు అందిస్తూనే ఉన్నారు. నెల్లూరు నగరంలోనే కాకుండా జిల్లాలోనూ, రాష్ట్ర వ్యాప్తంగా అనేక సేవా సంస్థలకు, ఆలయాలకు తమవంతు తోడ్పాటుగా లక్షలాది రూపాయలను వితరణగా అందిస్తూ జిల్లాలో మహాదాతలుగా వీరు అందరి అభినందనలు అందుకుంటుండడం అందరికీ తెలిసిందే. దివ్యాంగులకు సాయంగా తమవంతు సేవలందించడం తమకెంతో ఆనందంగా ఉందంటున్నారు విపిఆర్ దంపతులు వినమ్రంగా. వారి మానవీయ హృదయానికి.. సేవాభావానికి.. 'లాయర్' అభినందనలు.

## టెన్త్‌లో సత్తాచాటిన.. 'విపిఆర్ విద్య' విద్యార్థిని.. వైష్ణవి



తాను నిరుపేద అయినప్పటికీ వదాన్యులు, ప్రముఖ విద్యాదాతలు విపిఆర్ దంపతుల సహాయ సహకారాలతో ఆ విద్యార్థిని కష్టపడి చదువుకుంటూ మంచి మార్కులు సాధించి తమకు చదువుచెప్పిన విద్యాసంస్థల ప్రతిష్టను ఇనుమడింపజేసి ప్రశంసలు అందుకుంటోంది. ఆ విద్యార్థిని పేరు.. వైష్ణవి. నెల్లూరు సమీపంలోని కనుపర్తిపాడు వద్ద విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న 'విపిఆర్ విద్య'లో చదువుకుంటున్న పేద విద్యార్థిని..వైష్ణవి. ఈ ఏడాది టెన్త్ పరీక్షల్లో 600లకు గాను 581 మార్కులు సాధించి వైష్ణవి తన ప్రతిభ నిరూపించుకుంది. చదువుకు పేదరికం అడ్డు కాకూడదనే ఆశయంతో విద్యాదాత విపిఆర్ ఎంతోమంది పేద విద్యార్థులకు 'విపిఆర్ విద్య'లో ఉచితంగా విద్యను అందిస్తున్న నేపథ్యంలో తమ విద్యాసంస్థ విద్యార్థిని బాగా చదువుకుని మంచి మార్కులు సాధించి ప్రథమశ్రేణిలో రాణించడంతో వారెంతో సంతోషించారు. రాజ్యసభ సభ్యులు, విపిఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు వైష్ణవిని అభినందించి, వైష్ణవి తదుపరి విద్యకు తమవంతు సహకారం అందిస్తామని, విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఉన్నత విద్యలు చదివిస్తామని అంటూ తమ విద్యాసంస్థలో ఈ ఏడాది నుంచి ప్రథమస్థానం సాధించిన వారందరి ఉన్నత విద్యకు తమ పూర్తి సహాయసహకారాలందిస్తామని చెప్పి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. విద్యార్థులను ప్రతిభావంతంగా తీర్చిదిద్దుతున్న విపిఆర్ విద్య సిబ్బందికి వారు అభినందనలు తెలియజేశారు. తాను నిరుపేద కుటుంబం నుంచి వచ్చినప్పటికీ ఎంతో అభిమానంతో తనను చదివిస్తూ ఈ స్థాయికి తీసుకువచ్చిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి, ప్రశాంతిరెడ్డికి, చదువు చెప్పిన గురువులకు అందరికీ ఈ సందర్భంగా వైష్ణవి తన కృతజ్ఞతలు తెలిపింది.

# ప్రకృతిని కాపాడుకోవాలి

**పోర్టు సిఇఓ అవినాష్‌చంద్‌రాయ్**



ప్రకృతిని కాపాడుకోవాలని, పచ్చదనాన్ని పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని అదానీ కృష్ణపట్నం పోర్టు సిఇఓ అవినాష్ చంద్‌రాయ్ అన్నారు. ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన పోర్టు పరిసరాల్లో మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిక్షించుకునే బాధ్యత తీసుకోవాలని కోరారు. తొలుత పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందిస్తూ ర్యాలీ చేపట్టారు. పర్యావరణాన్ని పరిరక్షించుకుందామంటూ అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. పోర్టు సిఇఓ సంజయ్ కొత్త, అసోసియేట్ జనరల్ మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


**VR COLLEGE GOLDEN JUBILEE FRIENDS NELLORE**

1970-1979 సం॥ల మధ్య V.R. కళాశాల, నెల్లూరులో చదివిన పూర్వ విద్యార్థుల సమావేశము 17.07.2022వ తేదీన నెల్లూరులో జరుప తలపెట్టినాము. అందు కొరకు Whatsapp group ప్రారంభించబడినది. మీరు ఆ దశకంలో విద్యార్థులయినచో, గ్రూపులో సభ్యులుగా చేరి, సలహాలను ఇచ్చి, కార్యక్రమమును జయప్రదము చేయవలసినదిగా కోరుచున్నాము.

**ఎస్.విద్యాసాగర్**
(1973-76 B.Sc., B-Sec)
Convenor
Contact:
98490 82239, 94943 02641
79815 93559, 94414 77614
90004 46809



# రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చిన జగన్

**--- దుయ్యబట్టిన టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి ---**



రాష్ట్రాన్ని సక్రమంగా పరిపాలించడం చేతగాక ముఖ్యమంత్రి జగన్ అన్ని వర్గాల ప్రజలను కష్టాల కుంపట్లోకి నెట్టాడని, రాష్ట్రంలో ప్రశాంతంగా బతికేందుకు కూడా మరో స్వాతంత్ర్య పోరాటం చేయాల్సిన పరిస్థితులు తెచ్చారని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దుయ్యబట్టారు. ఏదో ఉద్ధరిస్తాడని 151 సీట్లతో అందలం ఎక్కించిన ప్రజలను పాతాళంలోకి తొక్కేస్తూ పాలన సాగిస్తున్నాడని ఆయన విమర్శించారు. ఇటీవల గూడూరు నియోజకవర్గంలో జరిగిన క్లస్టర్ల పరిశీలన సమావేశంలో సోమిరెడ్డి మాట్లాడారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని, వడ్డీల కిందే ఏడాదికి లక్ష కోట్లు కట్టాల్సిన పరిస్థితికి తీసుకొచ్చారని, చివరికి రాష్ట్రం ఎటుపోతుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. వైసీపీ పాలనలో రైతులతో సహా రాష్ట్రంలో అన్ని వర్గాల వారు పూర్తిగా నష్టపోతున్నారని, ధాన్యం ధరల విషయంలో ఒక్క గూడూరు నియోజకవర్గంలోని రైతులే 360 కోట్లకు పైగా నష్టపోయారని, కష్టించి పంటలు పండించినా కనీస మద్దతు ధర లభించకపోవడం బాధాకరమన్నారు. పరిశ్రమలను నడపడం పక్కనపెట్టి వాటిని మూతేయడంపైనే వైసీపీ ప్రభుత్వం దృష్టి పెట్టడం దారుణమని, ఎన్నికల సమయంలో కోవూరు షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని హామీ ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు దానిని పూర్తిగా మూసేయడానికే ప్రయత్నించడం ఏమిటని ప్రశ్నించారు. ఏపీ జెన్కోను అదానికి అప్పజెపేందుకే ఒక పథకం ప్రకారం ఆ ప్లాంట్‌ను నష్టాల్లోకి నెడుతున్నారని, ప్రాణాలను పణంగా పెట్టయినా సరే.. జెన్కో ప్రాజెక్టును కాపాడుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## నెల్లూరు కవులకు 'కృతి' సత్కారాలు



'కృతి' ఫౌండేషన్ తొలి వార్షికోత్సవం సందర్భంగా ఇటీవల ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో సాహితీ, కళా, సేవారంగాల్లో ఉత్తమ సేవలందిస్తున్న పలువురికి పురస్కారాలు అందజేశారు. ఆయా రంగాల్లో వారందిస్తున్న సేవలను ప్రముఖులు కొనియాడారు. ఇందులో భాగంగా సాహితీ రంగంలో నెల్లూరుకు చెందిన కవి, 'లాయర్' వారపత్రిక సబ్ ఎడిటర్ మద్దూరు శ్రీనివాసులు ('వాన' దీర్ఘకవిత)కు, కవయిత్రి ములుగు లక్ష్మీమైథిలి ('కరచాలనం' కవితాసంపుటి)కి ఈ పురస్కారాలు లభించాయి. 'కృతి' ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీరికి జ్ఞాపికలు బహుకరించి ఘనంగా సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ ఛైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ మందపాటి శేషగిరిరావు, కళారత్న బిక్కి కృష్ణ, వైఎస్సార్సీపి మహిళా విభాగం ప్రధానకార్యదర్శి జమ్మలమడక నాగమణి, రాజా వాసిరెడ్డి ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి, 'కృతి' ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ బివి అశ్విని పాల్గొన్నారు.

## సినీ సంగీత దర్శకుడు మాధవపెద్దికి..

# బాలు పురస్కారం



భారతీయ సినీ గాయకుడు, గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 76వ జయంతి సందర్భంగా ప్రముఖ సినీ దర్శకుడు మాధవపెద్ది సురేష్‌కు 'ఎస్పీ బాలు పురస్కారం' లభించింది. నెల్లూరులోని చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఈనెల 5న ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. బాలు సంగీత ప్రస్థానంలో అత్యధికశాతం కార్యక్రమాల్లో బాలుతో కలసి పాల్గొన్న తనకు బాలు స్వస్థలమైన నెల్లూరులో ఆయన పేరుమీద పురస్కారం అందుకోవడం తన పూర్వజన్మ సుకృతమని మాధవపెద్ది ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు. బాలు తనకెంతో ప్రోత్సాహాన్ని ఇచ్చేవారని, ఆయనతో కలసి పనిచేసిన రోజులను ఆయన గుర్తుచేసుకున్నారు. తన గంధర్వగానంతో బాలు నెల్లూరుసీమకు విశ్వవ్యాప్తిని తెచ్చారని, బాలు పురస్కారంతో తన జన్మ ధన్యమైందని అన్నారు. చేతన కార్యదర్శి వై.శేషగిరీశం ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్‌హాలులో జరిగిన బాలు జయంతి వేడుకల్లో సంగీతరంగంలో విశేష కృషిచేస్తున్న మాధవపెద్దికి, ప్రముఖ గాయకుడు 'అభినవ ఘంటసాల'గా ప్రఖ్యాతి చెందిన నెల్లూరీయుడు పాటూరు శ్రీనివాసులుకు బాలు పురస్కారాలను ప్రదానం చేశారు. బాలు పాటలు ఆపాతమధురాలని, ఆ మధురగానం చిరస్మరణీయమైనదని ఈ కార్యక్రమంలో పాల్గొన్న వెంకటగిరి సంస్థానాధీశులు డా.విబి సాయికృష్ణయాచేంద్ర అన్నారు. బాలు లేకున్నా ఆయన పాడిన పాటలు మనందరి హృదయాల్లో నిలచిపోయాయని, బాలు లేని లోటు ఏనాటికీ తీరనిదని ఆయన అన్నారు. పద్యకళా పరిషత్ వ్యవస్థాపకులు మెట్టు రామచంద్రప్రసాద్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ప్రముఖ సినీ విశ్లేషకుడు ఎస్వీ రామారావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఏఆర్ఎస్ స్టీల్స్ డైరెక్టర్ చింతా సత్యనారాయణమూర్తి (గుమ్మిడిపూడి), డిఎస్పీ కొల్లు శ్రీనివాసరావు, ప్రముఖ సినీమాటల రచయిత పి.రాజేంద్రకుమార్, కిన్నెర ఆర్ట్స్ ప్రధాన కార్యదర్శి మురళి (హైదరాబాద్), ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు, విఆర్‌సి విశ్రాంత ప్రిన్సిపాల్ డా. ఎం. సుబ్రహ్మణ్యం, మోడరన్ స్కూల్ అధినేత వాకాటి విజయకుమార్‌రెడ్డి, టీవీ నటుడు సింగంశెట్టి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు. తొలుత నిర్వహించిన 'బాలు స్వరాంజలి' కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది.

---

**తిరుపతి జిల్లా గూడూరు డివిజన్**

## మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలి

**- కమిషనర్ శ్రీకాంత్**



పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హరిత నగరాలకు శ్రీకారం చుట్టిన సందర్భంగా గూడూరు పట్టణంలోని వాటర్ ట్యాంక్ ప్రాంతంలో ఆ కార్యక్రమాన్ని ఈ నెల 7న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనంతో ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందని తెలియజేశారు. వైకాపా నాయకులు కోడూరు మీరారెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, బత్తిన విజయకుమార్, నాశిన నాగులు, నరసయ్య, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులు నిబంధనలు పాటించాలి

**- ఎస్.ఐ గోపాల్‌యాదవ్**



గూడూరు పట్టణం హాస్పిటల్ రోడ్డులో నెంబర్ ప్లేట్ లేని, సరైన పత్రాలు లేని, అధిక సౌండ్ వచ్చేలా సైలెన్సర్ బిగించిన వాహనాలు, నిబంధనలు ఉల్లంఘించి తిప్పే వాహనాలపై ఇటీవల గూడూరు ట్రాఫిక్ ఎస్సై గోపాల్ యాదవ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించి తిరిగే వాహనాలకు జరిమానాలు విధించారు. వాహనాల్లో తిరిగే వారు ఖచ్చితంగా సరైన పత్రాలు కలిగి ఉండాలని, లేని పక్షంలో ట్రాఫిక్ ఉల్లంఘన చట్టాల కింద కేసులు నమోదు చేస్తామని తెలియజేశారు.



## ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ జన్మదిన వేడుకలు

వైకాపా ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి జన్మదిన వేడుకలను గూడూరు పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో ఈనెల7న నిర్వహించారు. ఈ సందర్భంగా వైకాపా నాయకులు మాట్లాడుతూ తన తండ్రి మాజీమంత్రి బల్లి దుర్గాప్రసాదరావు అడుగుజాడల్లో పేదల అభివృద్ధి, సంక్షేమం కోసం కళ్యాణ్ నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులురాజు, చంద్రనీల్, రమణయ్య, సునీల్, విశ్వనాథ్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభావంతులకు 'ప్రగతి' సన్మానం



పదవ తరగతిలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ స్థానాలు సాధించిన పువ్వాడ వెంకటసాయి లిఖిత్‌కుమార్, బి.రూపక్‌రెడ్డి, బి.భానుతేజలను బాలాజీనగర్‌లోని ప్రగతి సేవాసంస్థ కార్యాలయంలో ఇటీవల ఘనంగా సత్కరించారు. అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ట్రెజరర్ కె.శ్రీనివాసులు, శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ముట్టెంబాకను మేమే అభివృద్ధి చేశాం

**మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్**

ముట్టెంబాక గ్రామ పంచాయతీ పరిధిలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో రూ. 3.14 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేశామని గూడూరు తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. ఈ నెల 7వ తేదీ గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షులు దువ్వూరు మధురెడ్డి ఆధ్వర్యంలో గౌరవ సభను నిర్వహించారు. పార్లమెంటు అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, నాయకులు ఉచ్చూరు లక్ష్మీప్రసాద్ రెడ్డి, ఆరుమూరు శ్రీనివాసులురెడ్డి, కోట శ్రీనివాసులు, కుంచం దయాకర్, తిరుమలపూడి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులకు నిత్యావసర వస్తువులు



గూడూరు త్యాగరాజ వీధిలోని శ్రీ కళ్యాణవీరభద్రస్వామి దేవస్థానంలో ఇటీవల 'రెడ్' సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్‌వీల్ మరియు ఆంధ్ర మహిళా మండలి వారి సహకారంతో 37 మంది పేద వికలాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా ఇన్నర్ వీల్ క్లబ్ మరియు ఆంధ్ర మహిళా మండలి గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ రోహిణి ముఖ్య అతిథిగా విచ్చేశారు. దాతలుగా బండి వనమ్మ జ్ఞాపకార్థం వారి కుమార్తె మన్నారపు ఉష, మనుమరాలు ఉజ్వల వ్యవహరించి రూ.5000 అందజేశారు. ఇన్నర్‌వీల్ క్లబ్ కార్యదర్శి కొణిదల అనిత, జీవనిరెడ్డి, విష్ణువందనరెడ్డి, రెడ్ సంస్థ' ప్రెసిడెంట్ జానా సుధీర్, పల్లం వెంకటేశ్వర్లు, జమీర్ పాల్గొన్నారు.





# జయహో నేస్తమా!...

**ఒక సంకల్పం...**
విదేశాలలో ఉన్న మిమ్మల్ని స్వదేశానికి తిరిగి
రప్పించేలా ప్రేరణ కల్పించింది.

**ఒక ఆలోచన...**
ఆంధ్రప్రదేశ్‌లో శ్రీ సిటీ అనే ప్రయోగాత్మక
పారిశ్రామిక విప్లవానికి నాంది పలికింది.

**ఒక తపన...**
8,500 ఎకరాల నేలను అంతర్జాతీయ పరిశ్రమల
నిలయంగా మార్చింది.

**ఒక ఆశయం...**
28 దేశాల సంస్థలు 200కిపైగా పరిశ్రమలను
ఆంధ్రాలో నెలకొల్పేలా చేసింది.

**ఒక ధ్యేయం...**
50 వేలమందికి ఉపాధి కల్పించి,
వారి కుటుంబాలలో కోటికాంతులు నింపింది.

**ఒక లక్ష్యం...**
మరెన్నో పరిశ్రమల సాధన, మరో 50 వేలమందికి పైగా
ఉపాధి కల్పన దిశగా ముందుకు నడిపిస్తోంది.

**మీ నిరంతర సాధన...**
అత్యంత ప్రతిష్టాత్మక 'గౌరవ డాక్టరేట్'ను
మీ సొంతం చేసి మీ ప్రతిష్టను ఇనుమడింప చేసింది.

## డాక్టర్ రవీ...!

పారిశ్రామిక రంగానికే..
మీరు స్వర్ణాభరణం!
మీ ప్రస్థానం...
మాకెంతో గర్వకారణం!



**ఆత్మీయ అభినందనలతో...**
**మనోజ్ నంబూరు**



## చదువుల తల్లికే..


# ఘన 'కీర్తి'

- టెన్త్, ఇంటర్‌లోనూ ఫస్ట్
- ఎంబిబిఎస్‌లోనూ అగ్రస్థానం
- విద్యారంగంలో 8 గోల్డ్‌మెడల్స్
- తాజాగా 'నీట్'లో 83వ ర్యాంకు

*టెన్త్‌లో పదికి పది పాయింట్లు, ఇంటర్‌లో వెయ్యికి 988 మార్కులు. ఎంబిబిఎస్‌లోనూ రాష్ట్రస్థాయిలో అగ్రస్థానం సాధించిన కీర్తికృష్ణ విద్యా రంగంలో అపూర్వమైన కృషిచేస్తూ ఇప్పటికే వివిధ అంశాల్లో 8 గోల్డ్ మెడల్స్ సాధించింది. తాజాగా 'నీట్' పరీక్షలోనూ అఖిల భారత స్థాయిలో 8వ ర్యాంకును కైవశం చేసుకుని సింహపురి విద్యారంగంలో మరో ఆణిముత్యంలా మెరుస్తోంది.*

నెల్లూరు గిడ్డంగివీధికి చెందిన వరదా జగదీష్–మాధవిల కుమార్తె వరదా కీర్తి కృష్ణ చిన్నతనం నుంచి విద్యారంగంలో అమోఘమైన ప్రతిభతో రాణిస్తోంది. చదువే శ్వాసగా.. ధ్యాసగా రేయింబవళ్ళు కష్టపడి చదువుకుంటూ అనుకున్న లక్ష్యాలను సాధిస్తూ అందరికీ స్ఫూర్తిదాయకమవుతోంది. నెల్లూరు పెద్దబజార్‌లోని రత్నం స్కూల్‌లో 10వ తరగతి చదువుకుంటూ పదికి పది పాయింట్లు సాధించి జిల్లాలో ప్రథమస్థానం సాధించి రత్నం విద్యాలయాల కీర్తిని నిలబెట్టింది. అనంతరం నగరంలోని విశ్వసాయి స్కూల్‌లో చేరి ఇంటర్‌లోనూ 1000కి 988 మార్కులు తెచ్చుకుని జిల్లాలో ప్రథమంగా నిలిచి అందరి అభినందనలు అందుకుంది. ఆ తర్వాత నెల్లూరులోని నారాయణ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్‌లో చేరి, తొలి సంవత్సరం 86 శాతం మార్కులతో రాష్ట్రంలో ప్రథమస్థానం సాధించడంతో పాటు ద్వితీయ సంవత్సరంలో 87.6శాతం మార్కులతో రాష్ట్రంలో ప్రథమస్థానం కీర్తికృష్ణదే కావడం విశేషం. తృతీయ సంవత్సరంలో రాష్ట్రంలో 5వ స్థానంలోనూ, కాలేజీలో ప్రథమస్థానంలోనూ నిలిచింది. 2016లో బెస్ట్ ఔట్‌గోయింగ్ స్టూడెంట్‌గా రాణించడమే కాక విద్యారంగంలో వివిధ అంశాలకు సంబంధించి 8 బంగారు పతకాలు సాధించడం ఆమె ప్రజ్ఞాపాటవాలకు నిదర్శనం. తాజాగా 'నీట్' పరీక్షల్లో దేశవ్యాప్తంగా సుమారు లక్షా 85వేల మంది పాల్గొంటే కీర్తికృష్ణ 83వ ర్యాంకు సాధించడం విశేషం. నీట్‌లో రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉన్న ఇద్దరిలో కీర్తి ద్వితీయురాలైనా అద్వితీయ ప్రతిభతో చదువుల్లో మేటిగా నిలుస్తూ నెల్లూరు సీమ విద్యారంగంలో మరో అనర్ఘరత్నంగా ప్రకాశిస్తోంది. పీజీలో జనరల్ మెడిసిన్ పూర్తిచేయాలని, ఎం.డి కూడా చదివి వైద్యరంగానికి సేవలందించాలన్నదే తన లక్ష్యమని కీర్తి అంటోంది. ఆమె ఆకాంక్షలు ఫలించాలని ఆశిస్తూ.. చదువుల తల్లి ముద్దుబిడ్డ కీర్తికి..'లాయర్'..శుభాకాంక్షలు.

## పుస్తకాలు.. సరస్వతీ స్వరూపాలు



గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని, వాటి అభివృద్ధికి అందరూ సహకరించాలని జిల్లా కేంద్ర గ్రంథాలయం కార్యదర్శి సిహెచ్ ప్రసాద్ అన్నారు. ఇటీవల ఆయన నెల్లూరులోని కేంద్ర గ్రంథాలయంలో జరిగిన పుస్తకాల వితరణ కార్యక్రమంలో మాట్లాడుతూ పుస్తకాలు సరస్వతీ స్వరూపాలని, అందరికీ జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ శతావధాని, వ్యాస మహాభారత అనువాద కర్త సూరం శ్రీనివాసులు రచించిన 'సౌమనస్యము', 'ఏటివాలు జ్ఞాపకాలు', 'స్థావర జంగమం', 'రుక్మిణీశ విజయము', 'శివానందలహరి', దశావతార స్తుతి, 'సున్నితపు త్రాసు' గ్రంథాలను, ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ వెలువరించిన 'శ్రీ సీతారామ కల్యాణము (బాలకాండ)', పద్య సప్తశతి, పద్యానువాదము, వచనానువాదము, రోజుకోపద్యం శంకరాభరణం గ్రంథాలను గ్రంథాలయానికి వితరణగా అందజేసినందుకు గ్రంథకర్తలను ఆయన అభినందించారు. నెరసం అధ్యక్షుడు జయప్రకాష్, కెవి కృష్ణయ్య, అరుణ్‌కుమార్, రవీంద్ర బాబు, శశి, గిరిజ పాల్గొన్నారు.



## జొన్నవాడలో..

# లక్ష కుంకుమార్చన

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి సన్నిధిలో ఈనెల 5న లక్ష కుంకుమార్చన పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారిని, అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష కుంకుమార్చన చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన కెవి రంగారెడ్డి కుటుంబసభ్యులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు. ఆలయ నిర్వాహకులు పర్యవేక్షించారు.


## కళ్యాణ వీరభద్రుడికి

# ప్రత్యేక పూజలు

గూడూరు పట్టణంలోని త్యాగరాజ వీధిలో వెలసిన శ్రీ కల్యాణ వీరభద్ర స్వామి దేవస్థానంలో ఈ నెల 7వతేదీ ప్రత్యేకపూజలు చేశారు. ప్రత్యేక అలంకారంతో స్వామివారు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు, అష్టోత్తర శత నామావళి పూజలు వైభవంగా చేపట్టారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

# నేతల మాటల మంట.. బీజేపీకి తంటా

(మొదటి పేజీ తరువాయి)



నూపూర్‌శర్మ



నవీన్‌కుమార్ జిందాల్



అరబ్ దేశాల పర్యటనలో ప్రధాని ( ఫైల్ )

'తాడిని తన్నేవాడుంటే.... వాడి తల తన్నేవాడుంటాడు...' అన్న సామెత చందంగా నిన్న మొన్నటి వరకు విద్వేష ప్రసంగాలు, రెచ్చగొట్టే చర్యలు, మైనారిటీలపై దాడులతో దేశం మొత్తాన్ని తన కాషాయ రథ చక్రాల కింద నలిపేసేంత దూకుడుగా వ్యవహరిస్తూ వచ్చిన బీజేపీ... ఒక్కసారిగా ఇప్పుడు ఆత్మరక్షణలో పడిపోయింది. విద్వేష పూరిత భావోద్వేగాలతో దేశాన్ని మత ప్రాతిపదికపై విభజించడానికి రేయింబవళ్ళు పనిచేస్తున్న కమలం పార్టీకి మొదటసారిగా... కళ్ళు బైర్లు కమ్మేంత స్థాయిలో షాకు తగిలింది. 'చేతులు కాలాకా ఆకులు పట్టుకున్న' చందంగా ఇప్పుడు హడావుడిగా ఆ పార్టీ అగ్ర నాయకత్వం 'దిద్దుబాటు చర్యలు' మొదలుపెట్టింది.

నిజానికి, వారి పుట్టుక కాషాయం. వారి డీఎన్ఏ కాషాయం. వారి పెరుగుదల కాషాయం. వారి ఆలోచనలు కాషాయం. వారి చూపు కాషాయం, వారి మాట కాషాయం. వారి చర్యలు కాషాయం.

'ప్రజాస్వామ్యం' ముసుగులో బీజేపీ చేస్తున్న ఈ కాషాయీకరణకు తాజాగా ఊహించని ఎదురుదెబ్బ తగిలింది.

బీజేపీ అసిధారావ్రతంగా అనుసరిస్తూ వస్తున్న ముస్లిం వ్యతిరేక ధోరణి ఇప్పుడు అన్ని పరిమితులూ దాటి, ముస్లిం దేశాలను తాకింది. బీజేపీ భావజాలంలో పుట్టి పెరిగిన నూపూర్‌శర్మ అనే మహిళ, నవీన్ కుమార్ జిందాల్ అనే మరో నేత, తమ రోజువారీ 'విద్వేష చిమ్ముడు' కార్యక్రమంలో భాగంగా ముస్లిం మత పెద్ద మహమ్మద్ ప్రవక్తను సైతం వదిలిపెట్టలేదు. ప్రవక్తపై అభ్యంతరకరమైన వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో, బీజేపీ మతతత్వ రాజకీయం మొదటిసారిగా దేశ సరిహద్దులు దాటింది. ముస్లిం దేశాలు ఏ స్థాయిలో కాషాయ దళంపై తమ నిరసన గళం విప్పారో గమనిస్తే, ఈ వివాదం చిలికి చిలికి గాలివానలా మారుతుందన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒక దేశం కాదు. రెండు దేశాలు కాదు. దుబాయ్, ఒమన్, ఇండోనేసియా, ఇరాక్, మాల్దీవులు, జోర్డాన్ లిబియా, బహరైన్, కువైట్, సౌదీ అరేబియా మొదలైన పదిహేను దేశాలు ఆయా దేశాలలోని మన రాయబారులను తమ విదేశాంగ కార్యాలయాలకు పిలిపించి తీవ్ర అసహనాన్ని, అసంతృప్తిని, ఆగ్రహన్ని వ్యక్తం చేశాయి. ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన 'ఆ ఇద్దరినీ' తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశాయి. దాంతో పాటు, భారత ప్రభుత్వం బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కూడా కోరడంతో మోదీ ప్రభుత్వం ఒక్కసారిగా ఖంగుతింది.

తాము పాలు పోసి, పెంచి పోషిస్తున్న విభజన శక్తుల వ్యాఖ్యలకు ప్రతిస్పందన మన దేశం లోపలే ఉంటుందనే అంచనాతో కాషాయికరణ అస్త్రంతో దేశం మీద ఇంత కాలంగా బీజేపీ ఎగబడుతూ వచ్చింది. ఈ తాజా ఉదంతంతో ముస్లిం దేశాలన్నీ ఒక్కసారిగా మూకుమ్మడిగా నిరసన స్వరాన్ని వినిపించడం బీజేపీకి ఊహించని ఎదురుదెబ్బ.

బీజేపీ హిందూ మత పార్టీ అయినప్పటికీ, గల్ఫ్ దేశాలతో పాటు సౌదీ అరేబియా వంటి ముస్లిం దేశాలతో భారత దేశానికి మంచి స్నేహసంబంధాలు ఉన్నాయి. గల్ఫ్ దేశాలతో గత ఏడాది 87 బిలియన్ డాలర్ల వ్యాపార లావాదేవీలు జరిగాయి. ఈ దేశాల్లో లక్షలాది భారతీయులు పనిచేస్తున్నారు. వారు, ఏటా వందల కోట్ల రూపాయలు స్వదేశానికి పంపిస్తుంటారు. ఇంధన అవసరాల కోసం మన దేశం ఈ గల్ఫ్ దేశాలతో పాటు ఇరాన్, సౌదీ అరేబియా వంటి ముస్లిం దేశాలపై ఆధారపడి ఉంది.

గత ఎనిమిదేళ్ళల్లో ప్రధాని మోదీ ఈ దేశాలను అనేకసార్లు సందర్శించారు. ఆ దేశాల పాలకులు మన దేశం పట్ల, నాయకుల పట్ల అత్యంత సుహృద్భావం ప్రదర్శిస్తూ ఉంటారు. ఇండియాపై తోటి ముస్లిం దేశమైన పాకిస్తాన్ చెప్పే చాడీలను, చేసే ఫిర్యాదులను సైతం అవి పట్టించుకోవు.

అంతటి 'గుడ్ విల్' కాస్తా, ఇప్పుడు బూడిదలో పోసిన పన్నీరైంది. అక్కడికీ మన రాయబారులు ఆయా ముస్లిం దేశాధినేతలను కాళ్ళా వేళ్ళా బడి బతిమిలాడుతున్నారు.

'వారి దురహంకార పూరిత వ్యాఖ్యలు వారి సొంతమని, బీజేపీకి గానీ... భారత ప్రభుత్వానికి గానీ సంబంధం లేదని, వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేసేశామని, దీనిని మనసులో పెట్టుకోవద్దని' మన రాయబారులు ఆయా దేశాధినేతలకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఢిల్లీ పోలీసులు బీజేపీ బహిష్కృత నేతలైన నుపుర్‌శర్మ, నవీన్‌కుమార్ జిందాల్ తదితరులపై కేసు నమోదు చేశారు. విద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నారన్న అభియోగాలను వారిపై మోపారు. ద్వేషపూరిత వ్యాఖ్యలతో ప్రజల్లో ప్రశాంతతకు భంగం కలిగిస్తున్నారంటూ ఆరోపించారు. ఢిల్లీ పోలీసు ఇంటెలిజెన్స్ ఫ్యూజన్ విభాగం (ప్రత్యేక సెల్) ఈ కేసును దర్యాప్తు చేస్తోంది కూడా. అయినా, వారి ఆగ్రహావేశాలు చల్లారడం లేదు. కొన్ని దేశాల సూపర్ బజార్లలో భారత ఉత్పత్తుల అమ్మకాలు సైతం నిలిపేశారు.

గత ఎనిమిదేళ్లుగా తన విద్వేష పూరిత విభజన రాజకీయంతో దేశంలోని ముస్లింలు, వారి మత విశ్వాసాలపై నిర్భీతిగా విరుచుకుపడుతూ వస్తున్న బీజేపీ ఇప్పుడు జరుగుతున్న పరిణామాలతో ఉక్కిరిబిక్కిరైపోతోంది.

తమకు ఏ మత విశ్వాసంపైనా చిన్న చూపు లేదని, అన్ని మతాలు, విశ్వాసాల పట్ల సమాన గౌరవం ఉందని బీజేపీ బుకాయిస్తుంది. తమకు ఎదురే లేదన్నట్టుగా ఇన్నాళ్లుగా వ్యవహరిస్తూ వచ్చిన ఆ పార్టీ, ఇప్పుడు దేశ ప్రజల ముందు తల దించుకు నిలబడింది. నవీన్ జిందాల్, నూపూర్ శర్మల వ్యాఖ్యలకు ముందు, తరువాత అన్నట్టుగా బీజేపీ రాజకీయం మారిపోయిందని పరిశీలకులు అంటున్నారు.

వాళ్ళు చేసిన వ్యాఖ్యలతో దేశంలో మరింత విభజన జరిగిందనే విమర్శలు వినబడుతున్నాయి. వాళ్ళ వ్యాఖ్యలను సమర్థిస్తూ భారీ ఎత్తున సంతకాల ఉద్యమం నడుస్తుండడమే ఇందుకు ఉదాహరణగా మేధావులు పేర్కొంటున్నారు. వారి చేష్టలతో బీజేపీ లక్ష్యమైతే నెరవేరింది గానీ, దేశం పరువు పోయింది. అంతర్జాతీయ సమాజం ముందు భారత్ తల దించుకుని నిలబడిందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. దేశంలో కాషాయ ఉద్యమానికి నేతృత్వం వహిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ మాత్రం యధావిధిగా నోరు మెదప లేదు. ఆయన మనసులో ఏముందో ఆయనకు, కాషాయిలకు మాత్రమే తెలుసు. అంతర్జాతీయ స్థాయిలో కాలర్ ఎగరేస్తూ తిరిగిన నరేంద్రమోడీకి ఇప్పుడు తల దించుకునే పరిస్థితి వచ్చింది. మన భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు గల్ఫ్ దేశాల పర్యటనలో ఉన్నప్పుడే ఈ పరిణామాలు చోటు చేసుకోవడం యాదృచ్ఛికం. తామే సృష్టించుకున్న సమస్యకు పరిష్కారం వెతికి బతికి బట్టకట్టాల్సిన బాధ్యత కమలదళం పైనే ఉంది....!

# ఎట్టకేలకు.. 'నీరు–చెట్టు' బిల్లులు

'నీరు–చెట్టు' పనులకు సంబంధించిన బిల్లులను చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు సమాయత్తమైంది. అందుకోసం నెల్లూరుజిల్లాకు 23 కోట్ల రూపాయలను ప్రభుత్వం కేటాయించినట్లు తెలుస్తోంది. ఈ పనులకు బిల్లుల చెల్లింపు జరగలేదంటూ కొంతమంది కాంట్రాక్టర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో, ఆ బిల్లులు చెల్లించాలంటూ న్యాయస్థానం ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో ప్రభుత్వం దిగివచ్చి రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఆ బిల్లులు చెల్లించేందుకు నిర్ణయించినట్లు భావిస్తున్నారు. జిల్లాలో సుమారు 205 పనులకు గాను 23 కోట్ల రూపాయల దాకా చెల్లించేందుకు ఆ పనుల వివరాలను సంబంధిత అధికారులు సేకరిస్తున్నట్లు సమాచారం.

# SHRADHANJALI



Please join us as we honour the life of

## Sri. Nalagatla Krishna Reddy Garu

**( Founder, Nagarjuna Group of Restaurants )**

We kindly request the presence of
friends and family for the Uttarakriyalu ceremony

**To be held on 16th June 2022, Thursday,
from 11:30am Onwards at Divyasree 77 East,
Iridium Clubhouse, Bangalore**

**Fondly Remembered by**

Sri. N. Anand Kumar Reddy & Family
Sri. D. Hari Prasad Reddy & Family
Sri. N. Mohan Reddy & Family

# ప్రభుత్వ పాఠశాలల్లోనే.. ఉత్తమ ఫలితాలు

- టెన్త్‌లో 6వేల మందికి 500కి పైగా మార్కులు
- విద్యార్థులను అభినందించిన కలెక్టర్ చక్రధర్‌బాబు



ప్రైవేట్ స్కూళ్ళలో కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులు చక్కగా చదువుకుంటున్నారని, తాజాగా 10వ తరగతి పరీక్షల్లో జిల్లావ్యాప్తంగా 6వేల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 500 మార్కుల కంటే ఎక్కువ సాధించి తమ ప్రతిభను చాటుకున్నారని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు సంతోషం వ్యక్తం చేశారు. టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో ఈనెల 8న తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వారిని అభినందించారు. మర్రిపాడు, కొండాపురం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు నూటికి నూరుశాతం ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. జిల్లావ్యాప్తంగా 16,329 మంది ప్రథమశ్రేణిలోను, 3837 మంది ద్వితీయ శ్రేణిలోను, 1839 మంది తృతీయశ్రేణిలోనూ ఉత్తీర్ణత సాధించారని, అన్ని పాఠశాలలతో కలిపి 6వేల మంది విద్యార్థులు 600కు గాను 500 కంటే ఎక్కువ మార్కులు సాధించారని ప్రశంసించారు. నెల్లూరులోని కెవిఆర్ మునిసిపల్ పాఠశాల విద్యార్థిని మేడా తర్లశ్రీ 590 మార్కులు సాధించిందని అంటూ 580 మార్కులకు పైగా సాధించిన 28 మంది విద్యార్థులకు కలెక్టర్ ఈ సందర్భంగా ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఆత్మకూరు సాంఘికసంక్షేమశాఖ హాస్టల్ విద్యార్థి కె.వేణుమాధవ్ 583 మార్కులు సాధించి జిల్లాలోని హాస్టల్ విద్యార్థుల్లో ప్రథమ స్థానం సాధించడం పట్ల కలెక్టర్ సంతోషం వ్యక్తం చేసి ఆ విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఇఓ రమేష్, ఎస్సీ సంక్షేమసాధికారత అధికారి రమాదేవి, బిసి-మైనార్టీ వెల్ఫేర్ శాఖల అధికారులు వెంకటయ్య, హమీద్, ఆత్మకూరు హాస్టల్ వార్డెన్ కె.నిరంజన్ పాల్గొన్నారు.

# 19 నుంచి.. వెంగమాంబ అమ్మవారి బ్రహ్మోత్సవాలు



జిల్లాలో ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన దుత్తలూరు మండలం నర్రవాడలో కొలువైవున్న శ్రీ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి బ్రహ్మోత్సవాలకు ఆలయ నిర్వాహకులు, అధికారులు భారీ ఏర్పాట్లకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈనెల 19 నుంచి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పచ్చవ వెంకటేశ్వర్లు, ఇ.ఓ వెంకటేశ్వర్లు తదితర అధికారులు ఏర్పాట్లపై చర్చిస్తున్నారు. గత రెండేళ్ళుగా కరోనా నేపథ్యంలో బ్రహ్మోత్సవాలు ఏకాంతంగా నిరాడంబరంగా జరిగాయని, ఈసారి వైభవోపేతంగా నిర్వహించాలని భావిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 19న నిలుపు, పసుపు దంచే వేడుక కార్యక్రమం ఉంటాయి. 20-21 తేదీల్లో అంగరంగ వైభవంగా అమ్మవారికి రథోత్సవం నిర్వహిస్తారు. 22న పసుపు, కుంకుమ ఉత్సవం, కల్యాణోత్సవం, ప్రదానోత్సవం జరుగుతాయి. 23న పొంగళ్ళ వేడుక ఉంటుంది. ఆలయం వద్ద ఏర్పాట్లు, ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసేందుకు ఆలయ నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు.

# రైతుల సంక్షేమమే ధ్యేయం

**- డిసిసిబి ఛైర్మెన్ సత్యనారాయణరెడ్డి**



రైతుల సంక్షేమం కోసం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగుతోందని డిసిసిబి ఛైర్మెన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి చెప్పారు. ఈనెల 6న ఆయన ఆత్మకూరులోని డిసిసిబి శాఖను సందర్శించి రైతులకు అందజేస్తున్న పథకాల అమలును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసిసిబి ద్వారా జిల్లాలో ఈ ఏడాది 1500 కోట్ల వ్యాపారాభివృద్ది జరిగిందన్నారు. పొదుపు సంఘాల మహిళలు ఆర్థికంగా ఎదగడం కోసం 75 పైసల వడ్డీకే రుణాలు అందజేస్తున్నామని, బంగారు ఆభరణాలపై 58 పైసల వడ్డీకి రుణాలిస్తున్నామని చెప్పారు. అనంతరం బ్యాంకు సిబ్బంది ఆయన్ను, డిసిసిబి మేనేజర్‌ను, ఎంపిపిలను సన్మానించారు. బ్యాంకు సిఇఓ చిన్నారెడ్డి, ఎంపిపి శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 12న కావలికి

# సిఎం రావొచ్చు

కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి కుమారుని వివాహ రిసెప్షన్ ఈనెల 12న జరుగనున్న నేపథ్యంలో వారిని ఆశీర్వదించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రావొచ్చని భావిస్తున్నారు. ఆ సమాచారంతో జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు ఈనెల 8న కావలికి వచ్చి హెలిప్యాడ్ ఏర్పాటుచేసే ప్రదేశాలను పరిశీలించారు. అయితే సిఎం పర్యటన అధికారికంగా ఖరారు కావాల్సివుంది.

### ఆత్మకూరు ఉప ఎన్నికలో..

# కాంగ్రెస్ పోటీ చేయదు

**- చేవూరు దేవకుమార్‌రెడ్డి**

ఆత్మకూరు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేయడం లేదని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి తెలిపారు. తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శైలజానాథ్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ఈనెల 5న ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### పెంచలకోనలో

# నిత్యాన్నదానానికి.. లక్ష విరాళం

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో నిత్యాన్నదాన పథకానికి చేజర్ల మండలం బిల్లుపాడు గ్రామానికి చెందిన భక్తులు జి.పెంచలనాయుడు-శివకుమారి దంపతులు ఈనెల 8న లక్షా నూటపదహారు రూపాయలు విరాళంగా సమర్పించుకున్నారు. విరాళం మొత్తాన్ని ఆలయ ఛైర్మెన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి, దేవాదాయశాఖ సహాయకమిషనర్ జె.వెంకటసుబ్బయ్యలకు అందజేశారు. దాతలకు ఆలయ నిర్వాహకులు స్వామివార్ల దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

### మురళీమోహన్‌రాజుకు

# తెనాలిలో సన్మానం



నెల్లూరుకు చెందిన కవి మురళీమోహన్‌రాజుకు తెనాలిలో సన్మానం జరిగింది. బొల్లిముంత శివరామకృష్ణ వర్ధంతి సందర్భంగా ఇటీవల నిర్వహించిన తెలుగురాష్ట్రాల మెగా కవి సమ్మేళనంలో మురళి రాసిన కవితకు బహుమతి లభించింది. ఈ సందర్భంగా ఈనెల 8న తెనాలిలో జరిగిన కార్యక్రమంలో ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త చందు సాంబశివరావు, తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్ సెక్రటరీ చందు సుబ్బారావు తదితర ప్రముఖుల చేతులమీదుగా ఆయన సన్మానం అందుకున్నారు. శాలువా, సర్టిఫికెట్, జ్ఞాపికతో వారు మురళిని సన్మానించారు.



### ఆనం వాళ్ల సమక్షంలో..

# టిడిపి నుంచి.. వైసిపిలోకి

నెల్లూరు రూరల్‌లోని 1వ వార్డు వైఎస్సార్సీపి నాయకులు గంగి జయరామిరెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల టిడిపికి చెందిన వంద మందికి పైగానే వైసిపిలో చేరారు. చింతారెడ్డిపాలెంలోని ఆనం నివాసంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డిసిసిబి మాజీ ఛైర్మెన్ ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, యువ నాయకుడు ఆనం కార్తికేయరెడ్డిలు వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆనం విజయ మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు ఎల్లవేళలా తాము అందుబాటులో ఉంటామని, పార్టీని బలోపేతం చేసేందుకు అందరూ కృషి చేయాలని అన్నారు. కోడూరుపాడు గ్రామ నాయకులు నాగేంద్ర, ఈగ వెంకటరమణయ్య, నాగేంద్ర, లక్ష్మయ్య, దానం, శ్రీనివాస్‌రెడ్డి బంకా సంజీవరెడ్డి, బంకా ఆదినారాయణ రెడ్డి, బంకా గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి శిక్షణతో.. మహిళలకు చేయూత

**- రెడ్‌క్రాస్ ఛైర్మెన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి**




ఉపాధి శిక్షణతో మహిళలకు ఆర్థిక చేయూత లభిస్తుందని రెడ్‌క్రాస్ ఛైర్మెన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. అందుకు రెడ్‌క్రాస్ తమవంతు సహకారం అందిస్తోందన్నారు. నెల్లూరు రెడ్‌క్రాస్, లయన్స్‌క్లబ్ ఆఫ్ ప్రియదర్శిని, లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రైడ్ సంస్థల సౌజన్యంతో నగరంలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో గత ఆరునెలలుగా టైలరింగ్ శిక్షణ పొందిన 35 మందికి ఆయన ఈనెల 8న గుర్తింపు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణలో పాల్గొనదలచినవారు 9647108108 నంబరుకు సంప్రదించాలని కోరారు. లయన్స్ క్లబ్ రీజనల్ ఛైర్మెన్ పార్థసారథి, లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రియదర్శిని అధ్యక్ష కార్యదర్శులు సౌజన్య, భవాని, లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రైడ్ అధ్యక్షుడు యశ్వంత్ విక్రమ్, రెడ్‌క్రాస్ సభ్యుడు దాసరి రాజేంద్ర, కన్వీనర్ డా. శ్రీరంజని, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బీద రాజ్యసభ సభ్యుడు కావడంతో..

# అందరూ 'హ్యాపీ'

- పేదలకు దుస్తులు పంపిణీ చేసిన సభ్యులు



బిఎంఆర్ గ్రూప్ ఛైర్మెన్, కావలి మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు రాజ్యసభ సభ్యునిగా నియమితులు కావడంతో కావలి ప్రజలు ఆనందంగా ఉన్నారు. ఆ సంతోషంతో కావలిలోని 'హ్యాపీ' స్వచ్ఛందసంస్థ ప్రతినిధులు ఈనెల 8న నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కావలి నియోజకవర్గంలోని పేదవర్గాలకు బీద ఎంతో సేవలు చేశారని, విద్య, వైద్యం అందించడంతో పాటు ప్రజల దాహార్తి తీర్చేందుకు ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటుచేశారని, పేదలకు కంటివైద్య శిబిరాలు నిర్వహించి ఉచిత ఆపరేషన్లు చేయించారని, ఇలా ఎన్నో రకాలుగా ప్రజలకు సేవలు చేస్తూ సేవకు ప్రతిరూపంగా నిలిచి బీద అందరి అభినందనలు అందుకున్నారని, అలాంటి సహృదయుడు రాజ్యసభ సభ్యుడు కావడం తమకెంతో ఆనందంగా ఉందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న 'హ్యాపీ' సంస్థ అధ్యక్షుడు ఘనీబాషా అన్నారు. ఆ సంస్థ గౌరవాధ్యక్షుడు ఎస్‌కె ఖాదర్‌బాషా, సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి, దేవరకొండ విజయకుమార్, ప్రియదర్శిని మహిళా మండలి అధ్యక్షురాలు ఎస్‌కె ఖాదర్‌బీ, గుడ్‌మెన్ అసోసియేషన్ అధ్యక్షులు బ్రహ్మయ్య, ఎస్‌కె దస్తగిరి, హజరత్తయ్య, రామదుర్గ, గిరిజ తదితరులంతా కలిసి 50 మంది నిరుపేద గిరిజన మహిళలకు చీరలు అందజేశారు.



# రాజకీయాలలోనూ కామెడీ పండిస్తున్న పవన్ కళ్యాణ్!!

'నేను, మా ఫ్రెండూ కలిసి పాకిస్తాన్ యుద్ధంలో 51విమానాలు పడగొట్టాం తెల్సా?' అన్నాడట ఒకతను.

'అబ్బా! నువ్వెన్ని? మీ ఫ్రెండ్ ఎన్ని పడగొట్టా రేంటీ!!' అన్నాడట, అది విన్నాయన.

"మా ఫ్రెండ్ 50. నేను 1' అన్నాడట ఆ మిలిటరీ వీరుడు...

'నువ్వు కందిపప్పు తీసుకు రా. నేను పొట్టు తీసుకు వస్తా. ఆ రెండూ కలిపి ఎంచక్కా ఊదుకు తిందాం...' అన్నాడట వెనకటికి ఒకడు.

ఇటువంటి సామెతలు, నానుడులు, జోకులు గుర్తుకు తెచ్చే విధంగా పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రకటనలు చేస్తూ, తమిళనాడు రాజకీయాల్లో గతంలో హడావుడి చేసిన తమిళ సినిమా హీరో కెప్టెన్ విజయకాంత్‌ను గుర్తుకు తెస్తున్నారు. కనిష్టంగా 40 శాతం ఓటింగ్ ఉన్న తెలుగుదేశం పార్టీ వెనక్కు తగ్గి, ఆరున్నర శాతం ఓటింగ్ తెచ్చుకున్న తనను ముఖ్యమంత్రిని చేయాలంటూ పవన్ కళ్యాణ్ మాట్లాడుతున్నారు.

వైసీపీతో పోరాటం చేస్తానే ఉంటానని, అందులో భాగంగా తెలుగుదేశంతో చేతులు కలిపి, వైసీపీ వ్యతిరేక ఓట్లు చీలిపోకుండా చూస్తానని ఆయన మొన్న 4వ తేదీన మంగళగిరిలో జరిగిన జనసేన వారి సభలో ప్రకటించి ఉంటే రాజకీయంగా ఆయన బలహీనతలు బయటపడకుండా ఉండేవి. తనను ముఖ్యమంత్రి చేయాలని అంటూ బైబిల్ సూక్తిని ప్రవచించడం ద్వారా ఆయన ప్రస్తుత వేడి వేడి రాజకీయ వాతావరణంలో కామెడీ జల్లులు కురిపించారు. నవ్వులు పండించారు. F4కు కావల సిన కథను దర్శకుడు రావిపూడి అనిల్‌కు ఫ్రీగా అం దించారు. 'ఇదీ నా రాజకీయం' అంటూ పదేళ్లనుంచి మూసి ఉంచిన గుప్పెట తెరిచి జనానికి చూపించారు.

ప్రస్తుత రాజకీయాలలో.....

ఐతే ఆత్మూర్, కాకపోతే ఘనాత్మూర్ అన్న ట్టుగా.... వైసీపీ, టీడీపీ మాత్రమే చావో.. రేవో అన్న స్థాయిలో రాజకీయంగా ఎదురెదురు నిలబడి ఉన్నాయి.

అయితే వైసీపీ. కాకపోతే టీడీపీ. మరో పార్టీకి అంగుళం చోటు కూడా లేదు.

మిగిలిన రాజకీయ పార్టీలు వైసీపీ వైపునో..., దానికి వ్యతిరేకంగానో..., ప్రత్యక్షంగానో... పరోక్షం గానో తమ తమ సింగిల్ కాల్ షీట్ సహాయ పాత్రలు పోషిస్తున్నాయి. అందులో జనసేన ఒకటి.

2014లో పవన్ కళ్యాణ్‌తో ప్రారంభమై.... ఇప్పుడు మరో ఇద్దరితో కలిసి.... ముగ్గురు మాత్రమే వేదిక మీద కనపడుతున్న పార్టీ జనసేన. గతంలో ఆయనొక్కరే వేదిక మీద కనపడేవారు. తరువాత, నాదెండ్ల మనోహర్ జత కలిశారు. ఇప్పుడు, పవన్ సోదరుడు నాగబాబు తోడయ్యారు. మూడు కుర్చీలు అయ్యాయి.

పవన్ కళ్యాణ్‌కు గల సినీ గ్లామర్, ఆయన సినీ ఫాన్ లోకం, యూత్ క్రేజ్, ఆయన కుటుంబ నేపథ్యం పెట్టుబడిగా జనసేన పేరిట ఓ రాజకీయ పార్టీ 2014లో ఆవిర్భవించింది. ఇది రాజకీయంగా పెను సంచలనాలు, సునామీలను సృష్టిస్తుందని ఆంధ్ర రాజకీయం గడగడలాడిపోయే రేంజ్‌లో జనసేన ప్రభావం ఉంటుందని పరిశీలకులు 2014లో అంచ నాలు వేశారు. పవన్ కళ్యాణ్ కుటుంబ విస్తృత పరి వారంలో కూడా ఇదే అభిప్రాయం ఉండి ఉంటుంది.

'2009లో మిస్ అయ్యాం. ఈసారి మిస్ అవ్వం' అని 2019 ఎన్నికల ముందు పవన్ కళ్యాణ్ సోదరుడు నాగబాబు నమ్మకంగా వ్యాఖ్యానించారు. పార్టీ ఎవరు పెట్టినా తమ పరివారం మొత్తం అంతా ఒకటే అనే భావం ఈ ప్రకటనలో ఇమిడి ఉన్నది. 2009 నాటి చిరంజీవి 'ప్రజా రాజ్యం' ప్రయోగాన్ని దృష్టిలో పెట్టుకుని ఆయన ఈ వ్యాఖ్యలు చేసి ఉంటారు.

సరే. 2019లోనూ మిస్ అయ్యారు. ఇక, ఇప్పుడు 2024 వస్తున్నది (కాకపోతే 2023). మరి, ఈసారి ఏమవుతుంది?

'2009లోనూ, 2019లోనూ మిస్ అయ్యాం. ఈసారి మిస్ అవ్వం...' అని ఇంకా నాగబాబు ప్రకటించలేదు. అందువల్ల, ఏమవుతుందో ఇప్పుడే చెప్పడం కరెక్ట్ కాదుగానీ 'ఏదో' అవ్వాలనే 'మైండ్ గేమ్' మాత్రం పవన్ మొదలుపెట్టినట్టు కనబడు తోంది. 'వైసీపీ వ్యతిరేక ఓటు' చీలిపోనివ్వనంటూ పవన్ కళ్యాణ్ కొంత కాలం క్రితం చేసిన ప్రకటన రాష్ట్ర రాజకీయవర్గాల్లో సంచలనమైంది.

పవన్ కళ్యాణ్ రాజకీయ పరిపక్వతకు 'ఔరా' అనుకుంటూ పలువురు ముక్కు మీద వేలు వేసు కున్నారు.

క్షేత్రస్థాయిలో వైసీపీకి ఎదురొడ్డి రాజకీయ పోరాటం చేస్తున్న టీడీపీకి స్నేహహస్తం అందించి, 2019లో చేసిన తప్పు ఈసారి చేయకూడదని పవన్ కళ్యాణ్ డిసైడ్ అయ్యారనే విశ్లేషణలు పెద్ద ఎత్తున వెలువడ్డాయి. వైసీపీ నేతలు కూడా ఈ ప్రకటనతో కొంచెం కలవరానికి గురైనట్టు కనిపించింది.

'దమ్ముంటే.... మూతిమీద మీసం ఉంటే.... సింగిల్‌గా టీడీపీ పోటీ చేయాలి. బస్తీమే సవాల్...' అనే సవాళ్లు కూడా వైసీపీ శిబిరం వైపు నుంచి వినిపించాయి. దీంతో, 'టీడీపీ ఎవరితో కలిస్తే, వైసీపీకి ఎందుకూ? అది ఆ పార్టీకి సంబంధించిన వ్యవహారం! గంగ అనుకుని మురుగుకాలువలో దూకుతుంది. వైసీపీకి ఏమిటి సంబంధం' అంటూ ప్రతి విమర్శలు కూడా వెలువడ్డాయి.






ఆ కలకలం ఇప్పుడిప్పుడే సర్దుమణుగుతోంది. వైసీపీలో 'ఆందోళన' ఎలా ఉన్నప్పటికీ టీడీపీతో జనసేన పొత్తు దాదాపు ఖాయమే అన్న భావన రాజ కీయ వర్గాల్లోను, మామూలు జనంలోనూ గట్టిగానే ఏర్పడింది. ఈ దశలో... ఇప్పుడు పవన్ కళ్యాణ్ మళ్ళీ ఓ రాయి విసిరి చూశారు, టీడీపీ స్పందన ఎలా ఉంటుందో చూద్దామనే సరదాతో కావచ్చు.

వైసీపీ వ్యతిరేక ఓటు చీలిపోనివ్వను అంటూనే... ఆ మాట అర్థం తన మనసులో ఏముందో కూడా ఈసారి వివరంగా చెప్పారు. గత 4వ తేదీన అమరా వతిలో తన పార్టీ వారి 'విస్తృత' సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'ఓ వెంట్రుకను కొండకు ముడివేద్దాం.... పోయేదేముంది వస్తే కొండ వస్తుంది.... పోతే వెంట్రుక పోతుంది' అన్న సామె తను గుర్తుకు తెచ్చే రీతిలో మాట్లాడారు.

వైసీపీ వ్యతిరేక ఓట్లు చీలకుండా ఉండడానికి 1. జనసేన + బీజేపీ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం, 2. జనసేన + తెలుగు దేశం + బీజేపీ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం, 3. జనసేన ఒక్కటే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అని పవన్ కళ్యాణ్ చెప్పారు. ఈ మూడు ఆప్షన్స్‌లోనూ ఆయనే ముఖ్యమంత్రి.

ఆయన 'రాజకీయ వ్యూహ చతురత'కు సభికులు హర్షధ్వానాలు చేశారు. తమ నేత మొన్న నాలుగో తేదీనే ముఖ్యమంత్రి అయిపోయినంత సంబర పడిపోయారు.

'జనసేన' అనేది పవన్ కళ్యాణ్‌కు ఓ 'ఫార్మ్ హౌస్' లాంటిదని జనానికి తెలుసు. బిజీ లైఫ్‌లో కొంచెం విరామం కావాలనుకున్నప్పుడు సినీ ప్రము ఖులు, సంపన్న వర్గాల వారు ఫార్మ్‌హౌస్‌కి వెళ్లి, మొక్కలకు నీళ్లు పొయ్యడం, ఆవులకు గడ్డి వేయడం, కూరగాయలు పెంచడం, కలుపు గడ్డి పరకలు పీకడం వంటివి చేస్తుంటారు. అది వారికి ఒక హాబీ. అలాగే, జనసేన అనేది పవన్ కళ్యాణ్ సరదా. ఆయన కాలక్షేపం. రిలాక్సింగ్ యాక్టివిటీ. అందుకే, పవన్ కళ్యాణ్ తాజా ప్రకటన అటు వైసీపీలోనూ, ఇటు టీడీపీలోనూ నవ్వులు పూయించింది. వైసీపీ నేతలు పైకే పగలబడి నవ్వితే, టీడీపీ నేతలు లోలోపల ముసిముసి నవ్వులు నవ్వుకుని ఉంటారు.

అసెంబ్లీ గత ఎన్నికల్లో (2019)టీడీపీకి 39.26% ఓట్లు వచ్చాయి. ఆ ఎన్నికల్లో 1. పవన్ కళ్యాణ్ సొంతంగా పోటీ చేశారు. అయినా టీడీపీకి 39.26% ఓట్లు వచ్చాయి.

2. వైసీపీ అధినేత జగన్ ఇమేజ్ ఆకాశం అంత ఎత్తున ఉన్నది. అయినా టీడీపీకి 39.26 శాతం ఓట్లు వచ్చాయి.

3. చంద్రబాబుని ఓడించాలనే కసి, పట్టుదల 'వైజాగ్ విష వాయువు'లా రాష్ట్రం అంతా వ్యాపిం చింది. అయినా టీడీపీకి 39.26% ఓట్లు వచ్చాయి.

4. చంద్రబాబును ఓడించి తీరాలని ప్రధాని మోదీ, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కంకణాలు కట్టుకున్నారని, అందుకోసం ఏమి చేయాలో అది చేశారంటూ భారీఎత్తున వార్తలు కూడా వెలువడ్డాయి. అయినా టీడీపీకి 39.26% ఓట్లు లభించాయి.

ఇన్ని ప్రతికూల పరిస్థితుల మధ్య కూడా టీడీపీకి దాదాపు 39.26 అంటే 40 శాతం ఓట్లు వచ్చాయి.

1. ఇప్పుడు మూడేళ్ల తరువాత టీడీపీ వ్యతిరేక వాతావరణం రాష్ట్రంలో పెద్దగా కనిపించడం లేదని (వైసీపీ అనుకూల వర్గాలలో మినహాయించి) అంటున్నారు.

2. 2019లో చంద్రబాబు మీద కోపంతో ఉన్న కాపులు, పవన్‌కళ్యాణ్ బాబుకు 'అజ్ఞాత మిత్రుడే'మో అన్న అనుమానంతో, జనసేనకు కూడా ఓట్లేయలేదు. జనసేనకు ఆరున్నర శాతం ఓట్లే వచ్చాయి. అయినా టీడీపీకి దాదాపు 40 శాతం ఓట్లు వచ్చాయి.

3. టీడీపీ ఇప్పుడు రేయింబవళ్ళు వైసీపీకి వ్యతి రేకంగా.... మునుగుడో, తేలుడో అన్నట్టుగా చేస్తున్న రాజకీయ పోరాటానికి జనంలో సానుకూల స్పందన కనబడుతున్న సూచనలు స్పష్టంగా కనపడుతున్నాయి. 2019లో కనిపించిన 'టీడీపీ వ్యతిరేకత' అనేది ఇప్పుడు వైసీపీ అనుకూల వర్గాలకే పరిమితమైనట్టు కనిపిస్తోంది.

4. ప్రభుత్వ యంత్రాంగం సహకారం లేకుండానే టీడీపీ సభలకు జనం పోటెత్తుతున్నారు. మొన్న ఒంగోలులో జరిగిన మహానాడు సమావేశాలకు వెల్లువెత్తిన జనమే దీనికి ఉదాహరణ.

ఎన్నికలకు ఇంకా ఏడాది నుంచి రెండేళ్ల సమయం ఉండగానే.... రాష్ట్రంలో నెలకొని ఉన్నట్టు కనిపిస్తున్న పరిస్థితి ఇది. మరో రెండేళ్ల తరువాత తెలుగుదేశం మరింతగా పుంజుకుంటుందని రాజ కీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

గత ఎన్నికల్లో దాదాపు 50 శాతం ఓట్లు సాధించిన వైసీపీకి యాంటీ ఇంకంబన్సీ వల్ల నాలు గైదు శాతం ఓటింగ్ తగ్గే సూచనలే క్షేత్రస్థాయిలో కనపడుతున్నాయని విశ్లేషకులు అంటున్నారు.

ఇప్పుడు, జగన్ పట్ల కాపులు 2019లో లాగా సుముఖంగా లేరు అని పవన్ కళ్యాణ్‌తో సహా చాలామంది అంచనా వేస్తున్నారు. వైసీపీకి దూరంగా జరిగిన కాపులలో ఎక్కువమంది ఈసారి, అటు టీడీపీతో పాటు, ఇటు జనసేనకు కూడా ఓటు వేస్తే వేయవచ్చు. కానీ, జనసేన పట్ల కాపులు ఏ నిష్పత్తిలో అనుకూలంగా స్పందిస్తే, బీసీలు అదే నిష్పత్తిలో జనసేనకు వ్యతిరేకంగా స్పందిస్తారు. జనసేన ఎదుగు దలలో అప్పుడు, ఇప్పుడూ, ఎప్పుడూ ఇదో ప్రధాన ప్రతి బంధకం. జనసేన ముఖ్యులు ఈ విషయం గమనించారో... లేదో... తెలియదు.

'ప్రజారాజ్యం' విషయంలో ఈ విషయం రుజు వైంది. అవసరానికి మించి కాపు జపం చేయడం కూడా 2019లో చంద్రబాబుకు బీసీలలో కొంత వ్యతిరేకత వచ్చింది. ఆయన ఓడిపోవడానికి అది ఒక కారణం.

అందువల్ల, పవన్ కళ్యాణ్ గనుక టీడీపీతో పొత్తు పెట్టుకుని పోటీచేస్తే, వైసీపీ వ్యతిరేక ఓటులో చీలికను ఎంతో కొంత మేరకు నిజంగానే నివారించిన వారు అవుతారు. టీడీపీతో పొత్తు లేకుండా, బీజేపీతో కలిసి అధికారంలోకి రావడమా లేకపోతే, జనసేన ఒక్కటే స్వతంత్రంగా పోటీచేసి అధికారంలోకి రావడమా అన్న ఆప్షన్ తన ముందు ఉన్నదని చెప్పడం ద్వారా కాపులలో కూడా పవన్ పట్ల చిన్న చూపు ఏర్పడే అవకాశం ఉంది. రాజకీయం అంటే పవన్ కళ్యాణ్‌కు ఎంత ఆటకాయతనంగా ఉంది అనుకుంటూ పలు వురు కాపు ప్రముఖులు ఆశ్చర్యపోతున్నారు. చివరికి, ఆయన ఏమి చేసినా.... అడ్వాంటేజ్ టీడీపీకే అనడంలో అనుమానం, అవసరం లేదు.

గతంలో జనసేనకు వేయబుద్ధి కాక, వైసీపీకి వేసిన కాపు ఓటర్లు.... ఈసారి వైసీపీ పట్ల విము ఖతతో... జనసేనకు వేయవచ్చుననేది ఒక అంచనా. ఆమేరకు వైసీపీకి నష్టం. వీరు 2019లోనూ తెలుగు దేశంకు వేయలేదు కనుక, ఇప్పుడు వేయకపోయినా తమకు అదనపు ఇబ్బంది లేదనేది టీడీపీలో ఒక అంచనాగా ఉంది. గతంలో జనసేనకు ఓట్ వేయ డానికి మనసొప్పక, వైసీపీకి ఓట్ వేసిన కాపు ఓటర్లు... ఈసారి వైసీపీని కాదని జనసేనకు ఎంత ఎక్కువ వేస్తే తమకూ వైసీపీకీ మధ్య ఓట్ల శాతం అంతరం అంత తగ్గుతుందనేది టీడీపీలో ఓ అభి ప్రాయం ఉంది. ఈ అంతరం గత ఎన్నికల్లో దాదాపు పదిశాతం ఉంది.

జనసేనకు ఓట్ వేసేవారిలో 90 శాతం కులాభి మానంతోనే వేస్తారని 2019లో రుజువైంది. జన సేనకు మాతృక అయిన ప్రజారాజ్యం పార్టీ విషయం లోనూ 2009లో రుజువైంది అంటారు పరిశీలకులు. (గమనిక : పవన్ కళ్యాణ్‌కు కులాభిమానం లేదు. నాగబాబు విషయం తెలియదు)

అందువల్ల, ఆయన తమతో పొత్తు పెట్టుకున్నా, పెట్టుకోకపోయినా తమకు నష్టం ఉండదనే భావన టీడీపీ వర్గాల్లో సైతం గట్టిగా వినిపిస్తోంది. అంటే వచ్చే ఎన్నికల్లో ఆయన 'డిసైడింగ్ ఫ్యాక్టర్' కాకపో వచ్చుననే భావనే బలంగా వ్యక్తమవుతోంది.

అయినప్పటికీ, ఆయన అప్పుడప్పుడూ ఇలాంటి చిత్ర, విచిత్ర ప్రకటనలు ఎందుకు చేస్తుంటారో అని జనసేన పట్ల కొద్దో.. గొప్పో.... అభిమానం గలవారు ఆశ్చర్యపోతూ ఉంటారు.

★ రాజకీయాలు ప్రధాన వ్యాపకం కాకపోవడం అయివుండవచ్చు.

★ రాగద్వేషాలకు అతీతంగా సలహాలు ఇచ్చే వారు లభించకపోయి ఉండవచ్చు.

★ లభించినా.... వారి మాట వినే లక్షణం పవన్ కళ్యాణ్‌కు ఉండి ఉండకపోవచ్చు.

★ తాను నియమించుకున్న 'రాజకీయ కార్యదర్శు'లకు అంతటి స్థాయి, అవగాహన, ఆయనకు దిశా నిర్దేశం చేసేంత చొరవ ఉండి ఉండకపోవచ్చు.

★ తనను తాను బాగా ఎక్కువగా ఊహించు కునే లక్షణం పవన్ కళ్యాణ్‌ను, జనసేనను, ఆయన రాజకీయాభిమానులనూ బాగా ఇబ్బంది పెడుతూ ఉండి ఉండవచ్చు.

★ ఇవన్నీ కలిపి ఉండవచ్చు.

★ రాజకీయాలలో కొనసాగడమే ముఖ్యమని భావిస్తూ ఉండడం వల్ల గెలుపోటములపై ఆయనకు అంత ఆసక్తి ఉండకపోవచ్చు.

★ స్థిరంగా ఉన్నట్టు కనపడుతున్న ఆంధ్ర రాజ కీయాన్ని ఓసారి గిలకొట్టిచూద్దాం... పోయేదేముంది అన్న భావన కావచ్చు. ఏమైనా, ఆంధ్ర రాజకీయాలలో పవన్ కళ్యాణ్ ఉండాల్సిందే. హాస్యపు జల్లులతో రాజకీయ వాతావరణాన్ని చల్లబరుస్తూ ఉండాల్సిందే.

- భోగాది వేంకట రాయుడు

# అభినందన సుమాంజలి







సమాజ సేవాభిలాషి,
బడుగుల శ్రేయోభిలాషి
అన్నింటినీ మించి మంచి స్నేహాభిలాషి
మా మిత్రుడు

## డాక్టర్ రవి సన్నారెడ్డి

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం నుండి

**గౌరవ డాక్టరేట్**

అందుకున్న సంతోష సమయంలో
మా అభినందన సుమాంజలి.

బొమ్మిరెడ్డి సురేష్‌రెడ్డి
బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి
బొమ్మిరెడ్డి సునీల్‌రెడ్డి

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com